Follow: @ANNTELUGU

ANN తెలుగు

02-06-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 180 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## ప్రభాస్ మూవీకి రివ్యూ ఇస్తా..



- అవకాశం వస్తే బాలీవుడ్ సినిమాలో నటిస్తా
- తెలంగాణ ప్రజలు చాలా గౌరవ ఆతిథ్యం ఇచ్చారు
- ఇక్కడి సంప్రదాయాలు, సంస్కృతి ఎంతగానో నచ్చాయి
- నాకు హైదరాబాద్ బిర్యానీ అంటే చాలా ఇష్టం
- మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ

08


## కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నాం



- ఆగమైన తెలంగాణను అభివృద్ధి చేసుకున్నాం
- సకల జనుల జీవితాల్లో సుఖ సంతోషాలతో నిండాలి
- ప్రజలకు కేసీఆర్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

02

## ఆపరేషన్ కగార్ పేరిట దుశ్చర్య



- ఫాసిస్టు శైలిలో మోదీ పాలన సాగుతోంది
- శాంతి భద్రత సమస్యను సాకుతో ఇదంతా చేస్తోంది
- ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సమయం ఆసన్నమైంది
- మావోయిస్టులతో చర్చలు జరపకుండా మారణహోమం ఎందుకు చేస్తోంది
- ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాలి..
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

03



## సీఎం రేవంత్‌ను కలిసిన సత్తుమల్లేష్

### గ్రంధాలయాల పరిస్థితిపై నివేదిక

హైదరాబాద్, మహా : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కరీంనగర్ గ్రంధాలయ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేష్ ఆదివారం కలిశారు. కరీంనగర్ లో జిల్లాలో గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించాక ప్రభుత్వం, జిల్లా మంత్రుల సహకారంతో చేపట్టిన పనులు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు, ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యతనివ్వడం యువతలో మనోధైర్యాన్ని నింపిందని, రేవంతన్న ప్రభుత్వంలో బాగా చదివితే ఉద్యోగాలు వస్తాయన్న నమ్మకం, ఉన్నత స్థితికి వెళ్తామన్న నమ్మకం యువతకు కలిగిందన్నారు. ఈ సందర్భంగా రేవంత్ టీం సభ్యుడు సంజీవరెడ్డి తన వివాహానికి రావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు.



## మేం రాము.. అంతే

- బీజేపీ సమావేశానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు డుమ్మా?
- స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి అధ్యక్షతన వర్క్ షాప్
- కచ్చితంగా హాజరు కావాలని ఆదేశాలు జారీ
- అయినా బేఖాతరు చేసిన పలువురు లీడర్లు
- నలుగురు మాత్రమే హాజరు.. కొందరు మాత్రం పూర్తిగా దూరం!
- మరి కొందరు నేతలు జిల్లా పర్యటనలో బిజీ.. బిజీ

వివరాలు 3లో

## దేశ అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- కాంగ్రెస్ పార్టీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్
- బీజేపీ తప్ప తెలంగాణను ఏ పార్టీ కాపాడలేదు

వివరాలు 3లో

# 5న కేబినెట్ భేటీ

## 5 కీలక అంశాలు



- మంత్రులతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి
- ధాన్యం కొనుగోళ్ళ బాగా జరుగుతున్నాయని ఉత్తమ్ కు సీఎం, మంత్రుల అభినందనలు
- తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ ఆవిర్భావ శుభాకాంక్షలు

“ తెలంగాణ ఆవిర్భావ సంబురాల వేళ శుభవార్తల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు.. ఆచితూచిగా పకడ్బందీగా ముందుకెళ్తామని తెలంగాణ కేబినెట్ సంకేతాలిచ్చింది. ఈ నెల 5న తెలంగాణ కేబినెట్ సమావేశం నిర్వహించి కీలక అంశాలను చర్చించాలని మంత్రుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఆదివారం ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్ర అవతరణ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వానకాలం పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసం అంశాలపై మంత్రులు అందించిన నివేదికపై సమావేశంలో చర్చించారు. - మహా, హైదరాబాద్

### కీలక చర్చ వీటిపైనే...

- రాష్ట్ర అవతరణ వేడుకలు
- ఇందిరమ్మ ఇండ్లు
- రెవెన్యూ సదస్సులు
- వానకాలం పంటల సాగు సన్నద్ధత
- రాజీవ్ యువ వికాసం

05

# మీనాక్షి బిజీబిజీ

### మంత్రి పదవులు కోరిన విజయశాంతి, అద్దంకి

- ఎంపీలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లతో విడివిడిగా భేటీలు
- సికింద్రాబాద్, నాగర్ కర్నూల్, వరంగల్ నేతలతో సమీక్షలు
- సరైన సందర్భంలో అర్హులకు పదవులు వస్తాయి విజయశాంతి
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ఎంపీ మల్లు రవి బాధ్యతలు
- మీనాక్షి, పీసీసీ చీఫ్‌లతో భేటీ.. మల్లు రవికి ఘనస్వాగతం పలికిన కార్యకర్తలు

హైదరాబాద్, మహా: రాష్ట్రంలో పార్లమెంట్ సీట్లపై ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమీక్షలు కొనసాగుతున్నాయి. పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టిన ఆమె.. ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో వరుసగా సమీక్షలు జరుపుతున్న సంగతి తెలిసిందే. మొత్తం 17 లోక్ సీట్లు ఉండగా ఇప్పటి వరకు 10కి పైగా మీటింగ్ లు పూర్తి అయ్యాయి. ఆదివారం హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మూడు పార్లమెంట్ స్థానాల అభ్యర్థులతో భేటీ అయ్యారు. వరంగల్, నాగర్‌కర్నూల్, సికింద్రాబాద్ నియోజకవర్గాల వారీగా నాయకులతో మీటింగ్ నిర్వహించారు.

మిగతా 3లో



ఏఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయిన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క. తనకి పొలిటికల్ అఫైర్స్ కమిటీలో స్థానం కల్పించినందుకు మీనాక్షి నటరాజన్ కు ధన్యవాదాలు తెలిపిన మంత్రి సీతక్క..



# కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నాం

## ఆగమైన తెలంగాణను అభివృద్ధి చేసుకున్నాం

- సకల జనుల జీవితాల్లో సుఖ సంతోషాలతో నిండాలి
- ప్రజలకు కేసీఆర్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు



**మహా:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. శాంతియుతంగా పార్లమెంటరీ పంథాలో కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఉమ్మడి రాష్ట్ర పాలనలో ఆగమైన తెలంగాణను స్వయం పాలనలో అభివృద్ధి చేసుకున్నామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సకల జనుల సంక్షేమాన్ని కొనసాగిస్తూ సమస్త రంగాల్లో ప్రగతిని సాధిస్తూ పదేండ్ల అనతికాలంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుకున్నామని వివరించారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రజల జీవన విధానం మరింత గుణాత్మకంగా సాగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకొని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల్లో విశ్వాసం నింపాలని కోరారు. తెలంగాణ మరింత ప్రగతిని సాధిస్తూ పాడి పంటలతో వర్ధిల్లుతూ రైతులు సబ్బండ కులాలు, సకల జనుల జీవితాలు సుఖ సంతోషాలతో నిండాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్షించారు.

# వడ్ల పైసలు ఇంకా పడలే..

## రేవంత్‌ది పూటకో మాట.. పూటకో వేషం

- రాష్ట్రంలో అందాల పోటీలు పెడితే అణా పైసా రాలే
- మిస్ వరల్డ్ పోటీలతో రాష్ట్రానికి చెడ్డ పేరు వచ్చింది
- ఇంగ్లాండ్ అమ్మాయిని రేవంత్ దోస్తులు ఇబ్బంది పెట్టితే పారిపోయింది
- మార్పు తెస్తామని చెప్పి తెలంగాణ తల్లిని మార్చారు
- మూసీ పునరుద్ధరీకరణ అని చెప్పి దానిని అక్కడే వదిలేశారు
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర విమర్శలు



**మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మార్పు తెస్తామని చెప్పి తెలంగాణ తల్లిని మార్చారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ గుర్తులను మారుస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారన్నారు. కేసీఆర్ చెప్పిన అభివృద్ధిని మారుస్తారా? అంటూ ప్రభుత్వ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం వచ్చాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్టీ అధినేత కేసీఆర్ తెలంగాణను నిలబెడితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పండపెడుతున్నాడని మండిపడ్డారు. ఆదివారం జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలుగు తల్లి విగ్రహాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కరెంట్ పోయేది కాదని కానీ ప్రస్తుతం కరెంట్ కోతలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఆగస్ట్ 15వ తేదీలోగా రైతు రుణ మాఫీ చేస్తానని యాదాద్రి దేవుడిపై సీఎం రేవంత్ రెడ్డి ఒట్టు వేశారని.. అలా ఒట్టు వేసి దేవుడునే మోసం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చిన రెట్టింపు పింఛన్ ఇస్తామని చెప్పి.. అది కూడా ఇవ్వలేదన్నారు. గజ్వేల్ ప్రజలు రేవంత్ రెడ్డి మాటలు నమ్మలేదన్నారు. జన్మలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయమని ప్రజలు పేర్కొంటున్నారన్నారు రైతుల కోసం జిలుగు విత్తనాలు రూ. 11 వందలు ఉంటే వాటిని రూ. 22 వందలు చేశారని రేవంత్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. ఏదైనా అంటే తమ వద్ద డబ్బులు లేవని అంటారన్నారు. కానీ అందాల పోటీలు పెట్టీ.. వాటి కోసం రూ. 200 కోట్లు ఖర్చు పెట్టారని వివరించారు.

**రియల్ ఎస్టేట్ బాగా నడిచేది..**

అందాల పోటీలు పెట్టీ ఇంగ్లాండ్ అమ్మాయిని రేవంత్ దోస్తులు ఇబ్బంది పెట్టితే ఆమె పారిపోయిందని గుర్తు చేశారు. మహిళల పట్ల రేవంత్ రెడ్డి దోస్తులు అనుచితంగా ప్రవర్తించారని నిప్పులు చెరిగారు. జనానికి జిలుగు విత్తనాలు ఇవ్వలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన అభివర్ణించారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారన్నారు. రూ. 1,100 కోట్లు బోనస్ రేవంత్ రెడ్డి బాకీ ఉన్నాడని పేర్కొన్నారు. వడ్ల పైసలు ఇంకా పడట్లేదన్నారు. మొదటి సంవత్సరమే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. తిప్పికొడితే 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఇక గురుకులాల్లో అభివృద్ధి సైతం లేదన్నారు. విందులు వినోదాల కోసమే ఈ అందాల పోటీలు పెట్టారన్నారు. అందాల పోటీల వల్ల రాష్ట్రానికి చెడ్డ పేరు మాత్రమే వచ్చిందని తెలిపారు. మూసి నది పునరుద్ధరీకరణ అని చెప్పి.. దానిని అక్కడే వదిలేశారని.. అలాగే హైడ్రా అని దాన్ని కూడా వదిలేశారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. ఏది ప్రారంభించినా రేవంత్ సర్కార్ ముందుకెళ్లిందే లేదన్నారు. ఇక కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ బాగా నడిచేదన్నారు. కానీ నేడు భూములు కొనే వారే కరువయ్యారని చెప్పారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులలో ఈగలు తోలుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ప్రజలు ఇల్లు కట్టున్నారని.. కానీ ప్రస్తుతం అవే ఇండ్లను బ్యాంకులకు తనకా పెడుతున్నారని చెప్పారు. గజ్వేల్ ఏరియాలో ఇండస్ట్రియల్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే 3 సంవత్సరాలలో రాబోయేది బిఆర్ఎస్ పార్టీనే అని మాజీ మంత్రి హరీశ్ రావు జోస్యం చెప్పారు. రాజీవ్ యువశక్తి పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే లబ్ధి చేకూరుతుందన్నారు.

# రష్యాపై ఉక్రెయిన్ మెరుపుదాడి

## ఏకంగా 40 యుద్ధ విమానాలు ధ్వంసం!

### ఉక్రెయిన్‌ను చర్చలకు ఆహ్వానించిన రష్యా



**మహా:** రష్యా మీద ఊహించని రేంజ్‌లో ఉక్రెయిన్ మెరుపుదాడికి దిగింది. ఆ దేశంలోని వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని పెద్ద ఎత్తున డ్రోన్లతో అటాక్ చేసింది. ఏకంగా 40 యుద్ధ విమానాలు ధ్వంసం! కాగా దెబ్బకు రష్యా చర్చలకు పై అంది. తూర్పు సైబీరియా బోర్డర్‌లోని సైనిక స్థావరాలను టార్గెట్‌గా చేసుకున్న ఉక్రెయిన్.. సుదీర్ఘ దూరం ప్రయాణించగలిగే సామర్థ్యం ఉన్న డ్రోన్లను ప్రయోగించింది. రష్యాపై ఉక్రెయిన్ ఈ స్థాయిలో దాడులకు తెగబడటం ఇదే తొలిసారి. ఉక్రెయిన్ అటాక్‌ను రష్యాలోని ఇర్కుట్స్ గవర్నర్ కూడా ధ్రువీకరించారు. తమ మిలటరీ యూనిట్ ధ్వంసమైందని ఆయన వెల్లడించారు. ఉక్రెయిన్‌కు చెందిన రిమోట్ పైలట్ ఎయిర్‌క్రాఫ్ట్ వల్ల ఈ విధ్వంసం జరిగిందని తెలిపారు. ఒలెన్యా, బెలయాతో పాటు మరో 4 మిలటరీ ఎయిర్‌బేస్‌ల మీద అటాక్స్ జరిగాయని ఇర్కుట్స్ గవర్నర్ పేర్కొన్నారు.

**ఇదే మొదటిసారి**

ఉక్రెయిన్ దాడిలో 40కి పైగా రష్యన్ యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయని కీవ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. టీయూ95, టీయూ22ఎం3 బాంబర్లతో పాటు ఏ50 యుద్ధ విమానాలు కూడా ధ్వంసమయ్యాయని వినిపిస్తోంది. రెండు దేశాల మధ్య యుద్ధం మొదలైన అనంతరం ఇంత భారీ రేంజ్‌లో ఉక్రెయిన్ దాడులకు దిగడం ఇదే ఫస్ట్ టైమ్. ఈ అటాక్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, తాజా ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఉక్రెయిన్‌ను చర్చలకు ఆహ్వానించింది రష్యా. ఇరు దేశాల నేతలు టర్కీలోని ఇస్తాంబుల్‌లో సోమవారం సమావేశం కావాలని కోరింది. ఈ ప్రతిపాదనలకు ఉక్రెయిన్ ఓకే చెప్పింది. మంత్రి రుస్టెమ్ ఉమెరోవ్ బృందం ఈ చర్చలకు హాజరవుతుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.

# బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సీఎం అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లాలి
- దేశవ్యాప్త కులగణన కాదు ముందు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించండి
- బీసీలు రాజకీయ పోరాటాలకు సిద్ధం కావాలి
- వచ్చే ఎన్నికల నాటికి బీసీలు రాజకీయ శక్తిగా ఏర్పడి అధికారాన్ని శాసిస్తాం
- దేశవ్యాప్త కులగలను కోసం త్వరలోనే ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తాం
- బీసీల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్



**మహా:** బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రిజర్వేషన్ల పెంపు కోసం సీఎం నేతృత్వంలో అఖిలపక్షంతో కేంద్ర ప్రభుత్వంపై ఉత్తిరిపించడానికి ఢిల్లీకి వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆదివారం కలింగభవన్ లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది ఈ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షత వహించగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ సంఘాలు చేసిన పోరాటం పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి త్వరలోనే దేశవ్యాప్తంగా సమగ్ర కులగలను చేపడతామని ప్రకటించడం అభినందనీయమని కానీ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లు కేంద్ర ప్రభుత్వం తమిళనాడు తలాలో 9వ షెడ్యూల్లో చేర్చి రిజర్వేషన్లకు రాజ్యాంగ పద్ధతి కల్పించాలని అప్పుడే కేంద్ర ప్రభుత్వం ని బీసీలు విశ్వసిస్తారని ఆయన అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బీసీ రిజర్వేషన్ సభ్యులను రాష్ట్రపతికి పంపి రెండు నెలలుగా కావోస్తున్న ఇప్పటికీ అధిగతి లేదని ఎప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి పిఎం నరేంద్ర మోడీపై ఒత్తిడి పెంచాలని బీసీ రిజర్వేషన్లు సాధించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి జులై రెండో వారంలో ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని, త్వరలోనే తమిళనాడు బీహార్, గోవా, యూపీ, రాష్ట్రాలు పర్యటించి కులగనను అమలు చేసే వరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తామని ప్రకటించారు స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలను రాజకీయంగా చైతన్యం చేయడానికి జూన్ జూలై రెండు నెలల్లో రాష్ట్రంలోని 33 జిల్లాలు పర్యటించనున్నట్లు ప్రకటించారు బీసీలు రాయితీలతో రాజీ పడకుండా రాజకీయ అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని బీసీల పోరాటం రాజకీయ పోరాటంగా మార్చి వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రాజకీయ అధికారం దక్కేలా కృషి చేస్తామని బీసీ సీఎం లక్ష్యంగా బీసీలు పనిచేయాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు

33 జిల్లాల నుండి బీసీలు భారీ ఎత్తున పాల్గొన్నారు సభకు ప్రారంభానికి ముందు జ్యోతిబాపూలే కు శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం పహల్గాంలో మరణించిన వారికి, యుద్ధంలో మరణించిన సైనికులకు సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేసింది. కాగా జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో జరిగిన పోరాటం తోనే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి దేశ వ్యాప్త కులగణన చేస్తామని ప్రకటించిఎందని ఈ ఘనత జాజుల శ్రీనివాస్ గౌడ్ కే దక్కిందని ఈ సందర్భంగా బిసి శ్రేణులు జాజుల శ్రీనివాస్ ను ఘనంగా గజమాలతో సన్మానించారు. 10 తీర్మానాలను ప్రవేశ పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు

- తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన 42% బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదించాలి తమిళనాడు రాష్ట్రతరాలో 9వ షెడ్యూల్లో చేర్చాలి
- వచ్చే జనాభా లెక్కల తో పాటు దేశవ్యాప్తంగా సమగ్ర కులగన చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు ఆలస్యంగా నైనా బీసీల పోరాటానికి స్పందించి సానుకూడా నిర్ణయం తీసుకున్న ప్రధాని మోదీ గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం
- బీసీలపై కేంద్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి చేరిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును తక్షణమే ఆమోదించి చట్ట రూపంలో తీసుకురావాలి
- స్థానిక సంస్థలు ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానిపై ఒత్తిడి పెంచాలి
- సమాచార కమిషనర్లు బీసీలకు జరిగిన అన్యాయాన్ని సర్దిద్దాలి అసెంబ్లీలో చేసిన తీర్మానం ప్రకారం ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులు ప్రభుత్వ పదవులు బీసీలకు 42 శాతం కేటాయించాలి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అని అడగడమే కాదు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 42 శాతం చిత్తశుద్ధితో అమలు చేయాలి
- ఈ డబ్ల్యూసి రిజర్వేషన్లను సవరించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి అగ్రకులాల పేదరికం ఆధారంగా రిజర్వేషన్లు నిర్ధారించాలి అలాగే ఏడబ్ల్యుసి రిజర్వేషన్లలో ఏబిసిడి వర్గీకరణ చేయాలి
- దేశవ్యాప్తంగా జరిగే కులగన 2025 సంవత్సరంలోనే చేపట్టాలి సమగ్ర కులగలను కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయాలి. అలాగే కులగన చేసిన తర్వాత బీసీలకు జనాభా ప్రకారం విద్యా ఉద్యోగ రాజకీయ రంగంలో బీసీ రిజర్వేషన్లు పెంచాలి
- ఇటు రాష్ట్ర ప్రభుత్వంపై అటు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి నిరంతరంగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయాలి. అందులో భాగంగానే జూన్ జూలై రెండు నెలలు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సభలు సమావేశాలు బైక్ ర్యాలీలు రౌండ్ టేబుల్ సమావేశాలు జిల్లా కేంద్రాల్లో దీక్షలు ధర్నాలు ఆందోళన నిర్వహించాలి
- దేశవ్యాప్తంగా సమగ్ర కొలగన కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్కోట చట్టసభలో బీసీలకు 50% రాజకీయ రిజర్వేషన్లు బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు రిజర్వేషన్ల సాధన కోసం త్వరలోనే తమిళనాడు బీహార్ ఆంధ్రప్రదేశ్ ఉత్తరప్రదేశ్ హర్యానా గోవా రాష్ట్రాల్లో పర్యటించి ఆయా రాష్ట్రాల్లో సభలు నిర్వహించాలి జూలై మొదటి వారంలో ఢిల్లీలో జాతీయ స్థాయి అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించాలి
- మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపి భారతదేశంలో ఎలాంటి హింసపుతావు లేని పరిష్కారాన్ని కేంద్ర ప్రభుత్వం చూపాలి, మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్కౌంటర్ ను ఖండించారు

ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్ బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, ప్రొఫెసర్ భాగయ్య, పర్ష హనుమాన్లు, గౌడుగు మహేష్ యాదవ్, వేణు మాధవ్, శేఖర్ సగర, చంద్రశేఖర్ గౌడ్, సుంకర శ్రీనివాసరావు, తారకేశ్వరి, రమ, వరంగల్ శ్రీనివాస్, నరాల సుధాకర్, ఎల్చాల దత్తు, కనకయ్య గౌడ్, చలమల నరసింహ, నల్ల సోమ మల్లయ్య, దాడి మల్లయ్య యాదవ్, కౌల జగన్నాథం, గోపి రజక, గీకు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



# కవిత కొత్త పార్టీ పెట్టొచ్చు..!!

## బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు

**మహా:** మెదక్ జిల్లా; తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామంలో పోస్ట్ ఆఫీస్ కార్యాలయ ప్రారంభోత్సవంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కల్వకుంట్ల ఇంట్లో నుంచి మరో పార్టీ పుట్టుకొస్తుందని, జూన్ 2న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కవిత కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో ఉన్నారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. కవిత పార్టీ పెడితే పక్క రాష్ట్రం మాదిరే ఇక్కడా జరుగుతుందని రఘునందన్‌రావు జోస్యం చెప్పారు. దేవుడు దెయ్యం ఎందుకయ్యాడు? : ఈ రాష్ట్రంలో దేవుళ్లు ఉన్నారా? దెయ్యాలు ఉన్నాయా? అనే లేనిపోని పంచాయతీలను నడుస్తున్నాయి. దేవుడు దెయ్యం ఎందుకయ్యాడు? పదేళ్లు సీఎంగా చేసినప్పుడు దేవుడు ఎందుకయ్యాడు? అని ఆయన కవితను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజలు భావించి పదేళ్ల తర్వాత మంచి గుణపాఠం చెప్పి ఇంట్లో కూర్చోపెడితే ఇప్పుడు ఒకరినొకరు తిట్టుకున్నట్టు చేసుకుంటున్నారని బీజేపీ ఎంపీ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయ్యే ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో గ్రూప్ పంచాయతీలు పెట్టుకుంటున్నారని, తండ్రికి, కూతురుకు మధ్య వర్దులు ఎందుకున్నారని ప్రశ్నించారు. నాయకులకు తండ్రి, కుమారుడు, అల్లుడు ఎవరికీ పడకపోతే కుమార్తె దగ్గరికి పోయే విధంగా కొత్త కుంపటి పెడుతున్నారని, చెల్లి కవిత మెంటల్గా ఫిక్స్ అయిందని సొంత ఎజెండా పెట్టుకుందామని, అక్క షర్మిల చేసినట్లు పాదయాత్ర చేద్దామని ఓ కొత్త పార్టీ కోసం ఆమె డిసైడ్ అయినట్టు కనిపిస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. జూన్ రెండో తేదీన కవిత కొత్త పార్టీ పెట్టె ఆలోచన కనిపిస్తుందని ఆరోపించారు. అధికారంలో ఉన్న పదేళ్లు పూలే విగ్రహం పెట్టడానికి చేతకాని వారే బీఆర్ఎస్ నాయకులని అన్నారు.

# జయజయహే తెలంగాణ

## నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం .. రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం

**మహా ప్రత్యేకం:** జయజయహే తెలంగాణ అంటూ.. తెలంగాణ సంబురాలకు సిద్ధమైంది. తెలంగాణ రెండో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలకు అంబరాన్ని తాకేలా జరుగుతున్నాయి. ఓవైపు మిస్ వరల్డ్ పోటీలతో ప్రపంచమంతా.. తెలంగాణ వైపు చూస్తున్న వేళ పోరాటాల నేల మరో విజయోత్సవానికి సిద్ధమైంది. జూన్ 2 తెలంగాణ చరిత్రలో మరిచిపోలేని దినం. ఎందరో త్యాగఫలం. మరెందరిదో పోరాటం. సోనియా నిశ్చయం.. కేసీఆర్ వ్యూహతంత్రం.. సకల తెలంగాణ ప్రజలు పిడికిలి బిగించి కోరుకున్న ఆకాంక్ష నెరవేరిన ఘన సందర్భం. మంచిని కొనసాగిస్తూ.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కీర్తికిరీటాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్తూ తెలంగాణ పయనిస్తున్నది. నాడు కేసీఆర్ నాయకత్వంలో, ఇపుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రగతిప్రస్థానంలో తగ్గేదెలే అన్నట్టుగా ముందుకెళ్తోంది. రాజకీయాలు ఎలా ఉన్నా.. తెలంగాణ ఎపుడూ రిచే. రిచెస్ట్ స్టేట్. హైదరాబాద్ తెలంగాణకు అన్నపూర్ణ. బంగారు గిన్నె.

**11వ వార్షికోత్సవాన**

జూన్ 2, 2025, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, భారతదేశంలోని 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన 11వ వార్షికోత్సవాన్ని సూచిస్తుంది. 2014 జూన్ 2న, దశాబ్దాల సుదీర్ఘ ఉద్యమం తర్వాత, ఆంధ్రప్రదేశ్ నుండి విభజించబడి తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఈ రోజు తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, సాంస్కృతిక గుర్తింపు, మరియు స్వయం పరిపాలన కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకునే ఒక చారిత్రాత్మక సందర్భం. ఈ ప్రత్యేక ఆర్టికల్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం యొక్క చరిత్ర, ప్రాముఖ్యత, మరియు వేడుకలను వివరిస్తుంది.

**చారిత్రక నేపథ్యం**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేవలం ఒక రాజకీయ సంఘటన కాదు, ఇది దశాబ్దాల పాటు సాగిన ప్రజా ఉద్యమం యొక్క విజయం. 1950ల నుండి, తెలంగాణ ప్రాంత ప్రజలు తమ ప్రత్యేక గుర్తింపు, సాంస్కృతిక వారసత్వం, మరియు ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేక రాష్ట్రం కోసం డిమాండ్ చేశారు. 1956లో, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలంగాణ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయబడింది, ఇది తెలుగు మాట్లాడే ప్రజల కోసం ఒక ఏకీకృత రాష్ట్రంగా ఏర్పడింది. అయితే, ఈ విలీనం తెలంగాణ ప్రాంతంలో అసమాన అభివృద్ధి మరియు సాంస్కృతిక అణచివేతకు దారితీసింది, ఇది 1969 మరియు 1972లో ప్రధాన ఉద్యమాలకు కారణమైంది.

2001లో, కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కెసిఆర్) తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) స్థాపించడం ద్వారా ఈ ఉద్యమం కొత్త ఊపు సంతరించుకుంది. 2009లో కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం ద్వారా ఈ ఉద్యమం జాతీయ స్థాయిలో దృష్టిని ఆకర్షించింది. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ ఏర్పాటుకు సానుకూలంగా ఉండడంతో..



అప్పటి అధికారపార్టీ నేతలు ఎంతగా ప్రయత్నించినా చివరకు సోనియా నిర్ణయానికి, తెలంగాణ ప్రజల ఆకాంక్షకు, పోరాటపటిమకు తగ్గాల్సివచ్చింది. చివరకు, 2014 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ఆమోదించబడింది, మరియు 2014 జూన్ 2న తెలంగాణ అధికారికంగా ఏర్పడింది, హైదరాబాద్ రాజధానిగా మారింది.

**తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం యొక్క ప్రాముఖ్యత**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం కేవలం ఒక రాష్ట్ర ఏర్పాటును జరుపుకోవడం కాదు, ఇది ప్రజల సామూహిక ఆకాంక్షలు మరియు వారి స్వయం నిర్ణయం కోసం చేసిన పోరాటానికి గుర్తు. ఈ రోజు తెలంగాణ ప్రజల సాంస్కృతిక గుర్తింపు, చారిత్రక వారసత్వం, మరియు ఆర్థిక సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని సూచిస్తుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత, రాష్ట్రం విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, మరియు సాంకేతికత వంటి వివిధ రంగాలలో గణనీయమైన పురోగతిని సాధించింది. ఈ రోజు తెలంగాణ యొక్క సాంస్కృతిక సంపదను ప్రదర్శించడానికి ఒక వేదికగా కూడా ఉపయోగపడుతుంది. గొల్ల సుద్దులు, ఒగ్గు కథలు, పేరిణి శివ తాండవం, మరియు దెక్కనీ గజల్స్ వంటి సాంప్రదాయ కళారూపాలు ఈ వేడుకలలో ప్రముఖంగా కనిపిస్తాయి. ఈ రోజు రాష్ట్రంలోని 33 జిల్లాలలో జాతీయ జెండా ఎగురవేయడం, సాంస్కృతిక కార్యక్రమాలు, మరియు అవార్డు ప్రదానోత్సవాలతో ఘనంగా జరుపుకుంటారు.

**2025 లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

2025లో, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోనుంది. ఈ సంవత్సరం వేడుకలు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్నాయి, ఇక్కడ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తారు. ట్యాంక్ బండ్ వద్ద సాయంత్రం సాంస్కృతిక కార్నివాల్ జరుగుతుంది, ఇందులో 700 మంది కళాకారులు తెలంగాణ సాంప్రదాయ నృత్యాలు మరియు కళారూపాలను ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమంలో 5,000 మంది జాతీయ జెండాలతో "జయ జయహే తెలంగాణ" పాటతో ఫ్లాగ్ వాక్‌లో పాల్గొంటారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలలో నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. హ్యాండ్‌లూమ్, హస్తకళలు, మరియు తెలంగాణ వంటకాల స్టాల్స్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేయబడతాయి. ఈ వేడుకలు రాష్ట్ర సాంస్కృతిక వైవిధ్యాన్ని మరియు ప్రజల ఐక్యతను ప్రదర్శిస్తాయి.

**గణనీయమైన పురోగతిని సాధించిన తెలంగాణ**

గత 11 ఏండ్లలో తెలంగాణ రాష్ట్రం గణనీయమైన పురోగతిని సాధించింది. రైతు బంధు, రైతు బీమా, మరియు ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం వంటి పథకాలు రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచాయి. అలాగే, రాష్ట్రం విద్యుత్ సరఫరా, వ్యవసాయం, మరియు పరిశ్రమలలో రికార్డు స్థాయి విజయాలను సాధించింది. భవిష్యత్తులో, తెలంగాణ స్థిరమైన అభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలు, మరియు సామాజిక న్యాయంపై దృష్టి సారించనుంది. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మరియు పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ప్రజల ఐక్యత, సాంస్కృతిక గుర్తింపు, మరియు స్వయం నిర్ణయం కోసం చేసిన పోరాటానికి నిదర్శనం. 2025లో 11వ వార్షికోత్సవం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను, వారి సాధించిన విజయాలను, మరియు భవిష్యత్తు లక్ష్యాలను ప్రతిబింబిస్తుంది. ఈ రోజు, తెలంగాణ ప్రజలు తమ గతాన్ని స్మరించుకుంటూ, భవిష్యత్తు కోసం కొత్త ఆశలతో ముందుకు సాగుతారు. "జయ జయహే తెలంగాణ" పాటతో, రాష్ట్రం తన సాంస్కృతిక వైభవాన్ని మరియు ఐక్యతను ప్రపంచానికి చాటుతుంది.

# భద్రతా తీసుకోవాల్సిందే..

## ఎమ్మెల్యే రాజాసింగ్ కు పోలీసుల నోటీసులు

**మహా :** భద్రతా కారణాల దృష్ట్యా ప్రభుత్వం ఇచ్చిన భద్రత సిబ్బందిని బుల్లెట్ ప్రూఫ్ కారును ఉపయోగించుకోవాలని గోశామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్ కు పోలీసులు సూచించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మంగళహాట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మహేష్ రాజా సింగ్కు నోటీసులు జారీ చేశారు. భద్రతా కారణాల రీత్యా రాజాసింగ్ ఒంటరిగా తిరగవద్దు అని , ప్రభుత్వం ఇస్తున్న భద్రత సిబ్బందిని వినియోగించుకోవాలని అన్నారు

# ఆపరేషన్ కగార్ పేరిట దుశ్చర్య

## ఫాసిస్టు శైలిలో మోదీ పాలన సాగుతోంది

- శాంతి భద్రత సమస్యను సాకుతో ఇదంతా చేస్తోంది
- ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సమయం ఆసన్నమైంది
- మావోయిస్టులతో చర్చలు జరపకుండా మారణహోమం ఎందుకు చేస్తోంది
- ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాలి..
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు




**మహా:** మోదీ హయాంలో ప్రస్తుతం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఫాసిస్టు శైలిలో పాలన సాగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను తాము ముక్తకంఠంతో ఖండిస్తున్నామని, ఇది శాంతి, రాజ్యాంగం పట్ల విధ్వంసకర చర్యగా భావిస్తున్నామని అన్నారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినా చలించని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొట్టికాయలు వేస్తే మాత్రం ఉగ్రవాదులతో చర్చలకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. బాగ్ లింగంపల్లిలోని సుందర విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్‌లో ఆదివారం కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్‌ను నిలిపివేసి, కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలకు పూనుకోవాలని శాంతి చర్చల (పీస్ డైలాగ్ కమిటీ ) ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణకు ముందుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం, మన దేశ పౌరులైన మావోయిస్టులతో చర్చలు జరపకుండా మారణహోమం ఎందుకు చేస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాలని, ఇదే ప్రజాస్వామ్యానికి మౌలిక సూత్రమని హితవు పలికారు. కాంగ్రెస్ అహింస పునాదులపై నిర్మితమైందని చెప్పారు. హింస ఎవరి నుంచైనా వస్తే దాన్ని తాము ఖండిస్తామని చెప్పుకొచ్చారు. గతంలో ఆర్థిక అసమానతలతో నక్సలిజం పుట్టిందని, ఆ కాలంలో గ్రామాల్లో జరిగిన అఘాయిత్యాలు నక్సలిజం ద్వారా కొంతవరకైనా తగ్గాయని, కానీ క్రమేణ తప్పుదారి పడుతూ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యక్తిగత కక్షలు తీర్చుకునే ప్రయత్నాలకు వేదికగా మారిందని తెలిపారు మహేష్ కుమార్ గౌడ్.

### లౌకికవాద శక్తులు ఏకం..

నక్సలిజాన్ని నిర్మూలించేందుకు శాంతియుత పరిష్కార మార్గాలను పరిశీలించకుండా శాంతి భద్రత సమస్యను సాకుగా చూపి మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట దుశ్చర్యలకు పాల్పడుతోందని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. ఈ ఆపరేషన్ ద్వారా అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. మోదీ ప్రభుత్వంలో మతం, కులం పేరిట రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శలు చేశారు. 2014లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, మత సెంటిమెంట్‌ను సాకుగా చూపి బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో లౌకికవాద శక్తులు ఏకమవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో కమ్యూనిజం భావాలు ఉన్నవారు బలపడాలని కోరారు. దేశం మొత్తం ప్రజాస్వామ్య భావాలు ఉన్న వ్యక్తులు కలిసికట్టుగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. కేంద్రంలోని ఫాసిస్టు పాలనకు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు.

# 11 ఏండ్ల తెలంగాణం..

# సోనియమ్మకు ప్రణామం



నిక్కచ్చిగా... నిర్ద్వంద్వంగా చెప్పాలంటే... తెలంగాణ ఆశలు, ఆకాంక్షలన్నీ నీళ్లు... నిధులు... నియామకాలు మహత్తర ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నినాదాలు. ఒక సామాజిక తెలంగాణ కావాలని... కేవలం భౌగోళిక... భౌతిక తెలంగాణ మాత్రమే కాదని కదనం నడిచింది. అప్పుటి ఉమ్మడి రాష్ట్రంలో యువత, నిరుద్యోగుల పోరాటం, ఆత్మ బలిదానాలను ఆగాలన్న సదుద్దేశంతో తల్లి సోనియమ్మ తెలంగాణను ఇచ్చింది. సామాజిక తెలంగాణ సాకారం చేసి... ఆ తల్లికి తెలంగాణ సమాజం రుణం తీర్చుకోవాల్సి ఉన్నది. వెరసి, కోటి గొంతుకల తెలంగాణ... ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. ఈ ప్రాంత ప్రజల దశాబ్ధాల కల సాకారం అయింది. ఫ్రెంచ్, రష్యా, అమెరికన్, క్యూబా విప్లవాలకు సరిసమానమైన తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు తెలంగాణలోని ఒక కుటుంబానికే పరిమితం అవడం అత్యంత బాధాకరం. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు వచ్చిన కొలువులే తప్ప తెలంగాణ బిడ్డలకు ఒరిగిందేం లేదన్నది సర్వత్రా తెలిసిందే. తెలంగాణ 11ఏండ్లు పూర్తిచేసుకుని 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంలో.. తెలంగాణలో మొదట పాలించిన కల్వకుంట్ల కుటుంబానికి కరెన్సీ కట్టలు, కాసులు, కనకపు వర్షం తప్ప... సామాన్య ప్రజలకు ఏం రాలేదన్నది అక్షరసత్యం.

పదేండ్ల కారు పాలనలో కర్షకులు, కార్మికుల, కలం పట్టుకొని చదివిన విద్యార్థులు, జర్నలిస్టుల జీవితాల్లో కలవరం తప్ప మరొకటి లేకుండేది. ఆ పదేండ్ల పాలనలో పేపర్ లీకేజీలు... కోర్టు కేసులతో నిరుద్యోగ యువత ప్రాణాలతో కేసీఆర్ కుటుంబ సభ్యులు ఫుడ్ బాల్ గేమ్ ఆడారు. పిట్టల్లా యువత, విద్యార్థులు చనిపోతుంటే... అహంకారపు మాటలే తప్ప... ఎటువంటి భరోసా లభించలేదు. కేసీఆర్ నిర్లక్ష్యపు ధోరణి వల్ల, ఒక్కటి అంటే ఒక్క కాంపిటేటివ్ ఎగ్జామ్ కూడా రాయకుండానే లక్షలాది మంది ఉద్యోగ అర్హతకు అవసరమైన వయస్సును కోల్పోయయిన దుస్థితి నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత నియామకాలతో తెలంగాణ అంతటా కొలువుల జాతర సాగుతున్నది. 17 నెలల కాలంలోనే దాదాపు 50 వేల మందికి పైగా కొత్త కొలువుల్లో చేరడం దేశ చరిత్రలోనే ఒక అరుదైన రికార్డు. ఇదే విషయం ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి తన ఏడాది పాలనలో 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదని ఘంటాపథంగా చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఏమాత్రం డైజెస్టు చేసుకోలేని గులాబీ దళం కుట్రలు రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువత అర్థం చేసుకోవాల్సిన అవసరం... అనివార్యత ఉన్నది.

అసలు బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో ఒక్కటి అంటే ఒక్కటి కూడా గ్రూప్ 1 ఎగ్జామ్స్ నిర్వహించలేదంటే అతిశయోక్తి కాదు.... అబద్ధం అంతకంటే కాదు. సమైక్య రాష్ట్రంలో మన కొలువులన్నీ ఆంధ్రోళ్లు కొల్లగొట్టుకుపోతున్నారని నిత్యం విమర్శించిన కేసీఆర్... ఎందుకు తన హయాంలో ఒక్కసారి గ్రూప్1 పరీక్షలు నిర్వహించలేదో ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చి సమాధానం చెప్పాలి. ఆయన సీఎం అయిన ఎనిమిదేళ్ల తర్వాత 2022లో ఒకే ఒక్క గ్రూప్1 నోటిఫికేషన్‌ను కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. ఒకసారి పేపర్ల లీకుతో పరీక్ష రద్దు కాగా, మరోసారి బయోమెట్రిక్ విధానంపై గౌరవ హైకోర్టు ఆ పరీక్షను రద్దు చేసింది. ఆయన ఇచ్చిన నోటిఫికేషన్‌లో నిబంధనలు మీరే పాటించకపోతే ఎలా అని నాడు గౌరవ హైకోర్టు ప్రశ్నిస్తే... అసమర్థతకు నిదర్శనంగా నిలిచిన నాటి టీజీపీఎస్సీ నిబంధనలు మార్చుకోవడం తమ ఇష్టం అంటూ తల తిక్క సమాధానం ఇచ్చి ఈ రాష్ట్ర యువత జీవితాలతో ఆడుకున్నది. తన బిడ్డను నిజామాబాద్ ప్రజలు ప్రజాక్షేత్రంలో తిరస్కరిస్తే... వెంటనే మరొక పదవి అప్పగించిన పరిస్థితి కేసీఆరుకు ఉంటే... పేద బిడ్డల ఉద్యోగాల విషయంలో కేసీఆర్ కు మనసు రాకపోవడం ఆయన ద్వంద, కుటీల నీతికి నిలువెత్తు నిదర్శనం.

ఎన్నో అభ్యుదయ, అస్తిత్వ ఉద్యమాలకు కేంద్ర బిందువు ఉస్మానియా యూనివర్సిటీ వైపు తన పదేండ్ల కాలంలో కల్వకుంట్ల కుటుంబీకులు ఒక్కరూ పోలేదు. అశోక్ నగర్ అనేది ఒకటి ఉన్నదన్న విషయం మరిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందుకు తమ జాబులు పోతాయన్న నివేదికలు అందేసరికి కొంతమంది కిరాయి, పరాయి మనుషులతో నిరుద్యోగుల ముసుగులో చిట్ చాట్ నిర్వహించుకున్నారు మన ట్విట్టర్ మాస్టర్ కేటీఆర్. అయితే, అవి ఎన్నికల స్టంటులేనని తెలంగాణ ప్రజానీకం తేల్చిపడేశారు. కాగా, మాయమాటలు చెప్పడం వారికి వెన్నతో పెట్టిన... కానీ, ఎల్లకాలం మాయలు, మంత్రాలు నడవు కదా. వారి పాలనా కాలంలో గొర్రెలు ఇస్తాం... బర్రెలు ఇస్తామంటూ బడుగు బలహీన వర్గాలను శాశ్వతంగా బర్రెలు, గొర్రెల కాపర్లుగా ఉంచదానికే ప్రయత్నించిన భూస్వామ్య మనసిక వైకల్య ఎత్తులను జనాలు ఎత్తి పడేశారు. కేజీ టూ పీజీ అంటూ ఉద్యమ సమయం నుంచి ఊదరగొట్టిన కేసీఆర్ ఒక్క స్కూల్‌ను ఏర్పాటు చేయకపోగా... ఉన్న స్కూ ల్స్



-బి.మహేశ్ కుమార్ గౌడ్,
ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు

మూసివేసిన చరిత్ర వారికున్నది. ఎందుకంటే, గడీల దొరలకు పేదలు చదవొద్దు కదా. గ్రూప్1, ఉపాధ్యాయ నియామకాలే కాదు... మరే జాబుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్ళలేదు. అందుకే, వారికి మొన్నటి ఎన్నికల కదన రంగంలో తెలంగాణ సమాజం మొత్తం ఒక్కటై వారిని వెనక్కి నెట్టివేసింది. ఇంటికో ఉద్యోగం అని చెప్పి... తానెప్పుడూ అలా చెప్పలేదని అసెంబ్లీలో అడ్డంగా వాదించిన చరిత్ర కేసీఆర్ కు ఉన్నది. ఇది వారి కపట, ద్వంద్వ నీతికి... అధికార, అహంకార మనస్థత్వానికి ఆ రెండు ప్రకటనలే నిలువెత్తు నిదర్శనం కాదా?

గత పదేండ్ల కాలంలో కరెక్టుగా చెప్పలంటే, ఒక్క ఉద్యోగం కూడా సరిగా ఇవ్వని కేసీఆర్ ప్రభుత్వం... కల్వకుంట్ల నేతలు... వారి ఉద్యోగాలు పోయేసరికి నేడు నిరుద్యోగులకు తాము అండగా ఉంటామని చెబితే... దెయ్యాలు కూడా వీరి దమననీతి చూసి సిగ్గు పడుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల వరుస నియామకపత్రాల అందజేత కార్యక్రమం, నోటిఫికేషన్ల విడుదల చేస్తుంటే... ఉక్కిరిబిక్కిరి అవుతుండటమే కాకుండా... వారి నిక్కర్లు తడుస్తున్నాయి రేవంత్ రెడ్డి పరిపాలన, రాజకీయ ఎత్తుగడలను ఎదుర్కోడం చూసి తర్వాత. యువతను రెచ్చగొడితే తమ వైపు రాష్ట్ర రాజకీయం ఉంటుందని వారు ఇంకా భావించడం వారి భావదారిద్రానికి నిదర్శనం. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతుంటే, పెట్రోల్ పోసుకొని అగ్గిపెట్టే లేదంటూ ఆడిన నాటకంతో అనేక మంది నిప్పుపెట్టుకొని చనిపోయిన దుస్థితి. నేడు తెలంగాణ 12 ఏండ్ల వయస్సు కల్గిన రాష్ట్రం నేడు సామాజికంగా... రాజకీయంగా... ఆర్థికంగా... సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందంటే... కేవలం మన కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే అన్న విషయం తెలంగాణ సమాజం గుర్తెరగాలి.

# మేం రాము.. అంతే

## బీజేపీ సమావేశానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు డుమ్మా?

- స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి అధ్యక్షతన వర్క్ షాప్
- కచ్చితంగా హాజరు కావాలని ఆదేశాలు జారీ
- అయినా బేఖాతరు చేసిన పలువురు లీడర్లు
- నలుగురు మాత్రమే హాజరు.. కొందరు మాత్రం పూర్తిగా దూరం!
- మరి కొందరు నేతలు జిల్లా పర్యటనలో బిజీ.. బిజీ



**మహా:** తెలంగాణలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో జోరు మీద ఉన్న టీ బీజేపీకి కొత్త వివాదాలు చుట్టుముడుతున్నాయి. నేతల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు బయటపడుతున్నాయని తెలుస్తోంది. బయటికి పెద్దగా కనిపించకపోయినా అంతర్గతంగా పోటీ ముదురుతోందన్న ప్రచారం నడుస్తోంది. దీనికి కారణం రాష్ట్ర బీజేపీలో అధ్యక్ష పదవే కొత్త వివాదాన్ని సృష్టిస్తోందని కాషాయ పార్టీ లీడర్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. కొత్త అధ్యక్షుడి నియామకం ఎప్పుడనే విషయంపై స్పష్టత లేనప్పటికీ అంతర్గత పోరు మాత్రం రోజు రోజుకు ముదురుతోంది. తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌కు పలువురు కీలక నేతలు డుమ్మా కొట్టడంతో మరోసారి విభేదాలు బయటపడినట్లు తెలుస్తోంది. అయితే ఈ వర్క్ షాప్‌కు బీజేపీ పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు పాల్గొనాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**కేవలం నలుగురు మాత్రమే..**

ఈ వర్క్‌షాప్‌లో ముఖ్యంగా ప్రధాని మోదీ 11 సంవత్సరాల పరిపాలన, త్వరలో నిర్వహించే అంతర్జాతీయ యోగా డే, బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చ. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, వ్యవసాయ సంబంధిత సమస్యలపై మట్లాడుతారని చెప్పారు. అలాగే రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం, కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు, అలాగే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం, తదితర అంశాలను చర్చించనున్నారని తెలపగా.. పార్టీ సమావేశానికి కచ్చితంగా హాజరుకావాలని ఆదేశాలు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బేఖాతరు చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌కు పదకొండు మంది ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల్లో నలుగురు మాత్రమే హాజరు అయ్యారట. ఆ సమావేశానికి కిషన్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య మాత్రమే పాల్గొన్నట్లు సమాచారం. బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ నిజామాబాద్ పర్యటనలో ఉండడంతో ఆయన వర్క్ షాప్‌కు దూరం అయ్యారు. అలాగే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్ సమావేశానికి పూర్తిగా ఉన్నారని తెలిసింది. ఇక కరీంనగర్ పర్యటనలో ఎంపీ బండి సంజయ్ ఉండగా.. నిర్మల్ పర్యటనలో బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఉన్నారు. బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించడంతో పాటు పార్టీ భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పనకు నేతలు దూరం కావడం హాట్ టాపిక్‌గా మారింది.

# దేశ అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- కాంగ్రెస్ పార్టీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్
- బీజేపీ తప్ప తెలంగాణను ఏ పార్టీ కాపాడలేదు

ప్రధానమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీకి సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, భాజపా ప్రభుత్వానికి నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పదాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులకు వర్క్‌షాప్ నిర్వహించారు. నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన, అంతర్జాతీయ యోగాదినోత్సవం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహణ, వ్యవసాయానికి కేంద్రం అందిస్తున్న సహాయ సహకారాలు, రాష్ట్రంలో అకాలవర్షాల వల్ల జరిగిన నష్టం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, తాజా రాజకీయ పరిణామాలపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల వద్దకు వెళ్లి 11 ఏళ్ల మోదీ పాలనను వివరించాలని పదాధికారులకు దిశానిర్దేశం చేశారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలపాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ కలిసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయని, తెలంగాణను రక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి వికేంద్రీకరణ జరిగిందని, భారాస ప్రభుత్వంలో అవినీతి కేంద్రీకృతం అయిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి డబ్బులు తెలంగాణ రాష్ట్రం నుంచే వెళ్తున్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. భాజపా తప్ప తెలంగాణ రాష్ట్రాన్ని ఏ పార్టీ కాపాడలేదని, అందుకే ప్రజలు భాజపా వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలు, భారాస అవినీతిని ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు.

# మీనాక్షి బిజీబిజీ

## మంత్రి పదవులు కోరిన విజయశాంతి, అద్దంకి

- ఎంపీలు, కార్పోరేషన్ ఛైర్మన్‌లతో విడివిడిగా భేటీలు
- సికింద్రాబాద్, నాగర్ కర్నూల్, వరంగల్ నేతలతో సమీక్షలు
- సరైన సందర్భంలో అర్హులకు పదవులు వస్తాయి విజయశాంతి
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ఎంపీ మల్లు రవి బాధ్యతలు
- మీనాక్షి, పీసీసీ చీఫ్‌లతో భేటీ.. మల్లు రవికి ఘనస్వాగతం పలికిన కార్యకర్తలు



(మొదటిపేజీ తరువాయి)

కార్పోరేషన్ ఛైర్మన్‌లు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో మీనాక్షి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అధికార పార్టీ నేతల్లో ఉన్న పొరపొచ్చాలు, వారి మధ్య నెలకొన్న సమస్యలను సరిదిద్దే పనిలో పడ్డారు. తెలంగాణలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. ఎన్నికల ముందు వరుస మీటింగ్స్ నిర్వహించడం ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రధానంగా రాష్ట్రం జరిగే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నాయకులకు పలు సూచనలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని లోకల్‌గా ఉన్న సమస్యలపై ఆరా తీస్తున్నారు. పార్టీలో మంత్రి విస్తరణ, ఇతర పదవుల భర్తీపై నేతల ఎలిజిబిలిటీ, పర్ఫామెన్స్ గురించి కూడా మీనాక్షి అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ క్యాడర్‌తో భేటీ అవుతూ వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి ఎలా ఉంది, పార్టీ బలోపేతానికి ఇంకా ఏమేం చేస్తే బాగుంటుంది. రాష్ట్ర సర్కార్ సంక్షేమ పథకాలు ఎలా ఉన్నాయి.. వాటిపై ప్రజల అభిప్రాయాలేంటి అనే వివరాలను సేకరిస్తున్నారు. మరోవైపు ఆయా ప్రాంతాల్లోని నేతల మధ్య నెలకొన్న విభేదాలు ఏమిటి, వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాలని చర్యలు ఏంటని సమావేశాల ద్వారా మీనాక్షి నటరాజన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తక్కువ కాలంలో ప్రభుత్వంపై వస్తున్న నెగెటివ్ టాక్‌పై కూడా ఆమె ఆరా తీస్తున్నట్లు సమాచారం.

**మంత్రివర్గంలో అవకాశం కల్పించాలి..**

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో వరుసగా సమీక్షలు, కీలక సమావేశాలు జరిగాయి. పార్టీ పునర్వ్యవస్థీకరణ, కేబినెట్ విస్తరణ, నేతల లోపలి అసంతృప్తి అన్ని అంశాలూ ఈ సమీక్షల్లో కీలకంగా చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, సినీ నటిగా పేరుపొందిన మాజీ ఎంపీ విజయశాంతి మీనాక్షి నటరాజన్‌ను ప్రత్యక్షంగా కలిసి మంత్రివర్గంలో తమకు అవకాశం కల్పించాలని స్పష్టంగా కోరారు. విజయశాంతి అయితే మరింత స్పష్టంగా.. 'బీసీ కోటాలో నాకు మంత్రి పదవి ఇవ్వాలని' 15 నిమిషాలపాటు మీనాక్షితో ప్రత్యేకంగా చర్చించినట్లు సమాచారం. పార్టీకి తన గతంలో బీజేపీని వీడి తిరిగి కాంగ్రెస్‌లో చేరడం, గత ఎన్నికల్లో ఆమె చేసిన ప్రచారం వంటివన్నీ చూపిస్తూ ఆమె బలమైన వాదనలను మీనాక్షి ముందుంచినట్లు తెలిసింది. అద్దంకి దయాకర్ కూడా తాను జిల్లాలో బలమైన నేతనని, పార్టీకి మద్దతుగా గళమెత్తినందుకు మంత్రి పదవి కల్పించాలని కోరినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

### బాధ్యతలు స్వీకరించిన మల్లు రవి..

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ఎంపీ మల్లు రవి బాధ్యతలు స్వీకరించారు. గాంధీ భవన్‌లో చిన్నారెడ్డి నుంచి మల్లు రవి బాధ్యతలు తీసుకున్నారు. భారీ ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మల్లు రవికి స్వాగతం పలికారు. బాణసంచా కాలుస్తూ, నృత్యాలు చేస్తూ సంబురాలు చేశారు. పార్టీలో స్వేచ్ఛ ఉంటుంది, కానీ లక్ష్మణ రేఖ దాటవద్దని క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి తెలిపారు. తాను కాంగ్రెస్ పార్టీ వల్ల మూడుసార్లు ఎంపీ అయ్యానని, ఒకసారి ఎమ్మెల్యే, రెండు సార్లు ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధిని అయ్యానని గుర్తుచేశారు. పార్టీలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నియమించడం తనకు ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఉంటుందని అన్నారు. నాలుగు గోడల మధ్య నేతలు అభిప్రాయాలను తెలపాలని సూచించారు. ఎలాంటి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడవద్దని, క్రమశిక్షణ గీత దాటొద్దని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 01-06-2025
సాహిత్యం LITERATURE 04


## కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు - 4

# కవిత్వమొక ధ్యానం

ఏ వృత్తిలోనైనా వయసు పెరుగుతన్న కొద్దీ నైపుణ్యాలు క్షీణిస్తాయి . కానీ సృజన రంగంలో ఉన్న వారికి వయసు తో పాటు నైపుణ్యాలు క్షణ క్షణ క్షణాభివృద్ధి పొందుతాయి . వయసు తో అనుభవం పెరుగుతుంది . ఆలోచనల వైశాల్యం పెరుగుతుంది . సమాజాన్ని చూసే దృష్టి లో మార్పు వస్తుంది . మంచి చెడుల విచక్షణ పెరుగుతుంది . రచన లో సమ దృష్టి , న్యాయం అలవోకగా వచ్చి చేరతాయి . మిగతా వృత్తులలో అది సాధ్యం కాదు . . కవిత్వం ఒక కవి నుండి ఈ వయసులోనే ఉత్తుంగ తరంగం లా ముందుకు దూకుతుంది అనడానికి తారీఖులు ,దస్తావేజులు లాంటి సాక్ష్యాలు ఏమీ లేవు .

తన అరవై ఏళ్ళ వయసులో కవిత్వం రాయడం మొదలుపెట్టి ప్రచురించిన మొదటి కవిత్వ సంపుటికే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొంది ఇంకా ఉత్సహాంగా యువకులతో పోటీ పడి మరీ కవిత్వం రాసిన , ప్రముఖ డోగ్రీ గీత కారుడు , కవి యాష్ శర్మ కవిత్వం "ఏ టేల్ అఫ్ వర్జిన్ రివర్ "చదువుతున్నప్పుడు కలిగిన ఆలోచనల పరంపర అది . 1969 లోనే కేంద్ర సాహిత్య అకాడెమీ డోగ్రీ మోడరన్ ఇండియన్ ఇండిపెండెంట్ లిటరరీ లాంగ్వేజ్ గా గుర్తించినప్పటికీ 2003 దాకా డోగ్రీ ని రాజ్యాంగం లోని ఎనిమిదో షెడ్యూల్ లో చేర్చలేదు . ఉత్తర పంజాబ్ , జమ్మూ కాశ్మీర్ లోని కొన్ని భాగాలలో మాత్రమే మాట్లాడే డోగ్రీ భాష చిన్నదే కావచ్చు కానీ సాహిత్య పరంగా చాలా పెద్దదే . ఓ . పి శర్మ సారథి రాసిన "నగర మధనం "నా ఆల్ టైం ఫేవరేట్ నవలలో ఒకటి . ఇవాళ్టి ఆధునికానంతర సమాజం లో దాని ప్రాసంగికత ఎంతో వుంది . తెలిసీ తెలియని వయసులో చదివిన ఆ నవల నా మీద ఎంతో ప్రభావం చూపింది . ఇప్పుడు యాష్ శర్మ కవిత్వం చదువుతుంటే అచ్చు మన తెలుగు కవిత్వం చదువుతున్నట్టే ఉండి . కవిత్వ రంగం లోకి ఆలస్యంగా అడుగుపెట్టిన శర్మ డోగ్రీ భాష లో మంచి గీత రచయత . మొట్ట మొదటి డోగ్రీ భాషా సినిమా "గాలం హోయా బీటియా "కి తొలి గీత రచయత ఆయనే . తొలి టెలీ ఫిలిం "తాగి మేరీ సోన్ " కూడా శర్మ గీతాలతోనే ప్రజల మనసులను దోచుకుంది . మన శ్రీశ్రీ , ఆరుద్ర ,సినారె కవులుగా పేరుతెచ్చుకుని సినిమా గీత రచయితలుగా మారినట్టుగానే , శర్మ గీత రచయత గా పేరుతెచ్చుకుని కవిగా కుదురుకున్నాడు . జీవితం లో మెలోడ్రామా అంటే ఇలాగే ఉంటుందేమో

తన కళాశాల రోజులలో ప్రఖ్యాత హిందీ కవి హరివంశ్ రాయ్ బచ్చన్ స్ఫూర్తి తో హిందీ లో రాయడం మొదలు పెట్టిన శర్మ తరువాత మరో ఇద్దరు కవులు వేద్ పాల్ దీప్ , కేరీ సింగ్ మధుకర్ ల తో కలసి తన మాతృభాష డోగ్రీ లో రాయడం మొదలుపెట్టారు . "డోగ్రీ భాషా సాహిత్యాలకు మా వంతు దోహదం ఏదో చేయాలి అని అప్పుడు మేము అనుకున్నాము . డోగ్రీ భాష , సంస్కృతీ , సాహిత్యం పున



**యాష్ శర్మ,**
కవి, ప్రముఖ డోగ్రీ గీత కారుడు

రుజ్జీవం పొందుతున్న దశ అది . మా తల్లి తండ్రులు అనుకున్నట్టుగా మేము చదువుకుని ఉంటే నేను , నా స్నేహితులు ఎక్కడో బ్యూరోక్రాట్స్ గానో డాక్టర్లు గానో మిగిలి పోయే వాళ్ళం . కానీ, కవిత్వం , రచన మా దారి అది కాదు అని మమ్మల్ని తన దారిలోకి తెచ్చుకుంది" అంటారు శర్మ

కవిత్వం ఎలా రాస్తారు అనే ప్రశ్నకి నా దగ్గరేమీ జవాబు లేదు . "ఏదో ఒక అమృత ఘడియల్లో అది లోలోపల రూపు దిద్దుకుంటుంది . అదొక ధ్యానం లాంటిది . ఒక సంకేతం , ఒక సంజ్ఞ లేక పోతే ఒక కవిత మంచి కవిత గా మిగలదు . మంచి కవిత తన ప్రతి వాక్యం లో అంతర్గతం గానో , బాహ్యంగానో ఒక తాత్వికచింతనకి దారి దీపం అవ్వాలి . వచనం లాగా కవిత్వం కాదు కనుక తన అరుదైన లక్షణాన్ని నిలబెట్టుకోవడానికి కవిత్వం ప్రతీకను , సంకేతాన్నీ ,సంజ్ఞనూ ఎప్పుడూ వదలకూడదు . కవిత్వం ఊపిరి పీల్చినంత సహజం గా కవి భావనా ప్రపంచం లో నుండి బయటకు రావాలి" అంటారు యాష్ శర్మ . తన కవిత్వం కూడా అంతే సహజం గా ఉంటుంది . ఉదాహరణకి ఈ కవిత చూడండి

రావి చెట్టు
నేను ఊళ్లోకి ప్రవేశిస్తున్నప్పుడు
రహదారి ఏటవాలు అంచున నిల్చిన
ఆ పెద్ద రావి చెట్టు
మా నాన్న ని గుర్తుకు తెచ్చింది

ఇప్పుడు అమ్మా నాన్నా లేరు
నేనెవరి నుండి ఆ వెచ్చటి కౌగిలి ని ఆశించను ?

మా అత్తయ్యలు,నా దగ్గరి స్నేహితులు
నా నుండి దూరం జరిగినప్పుడు
నా హృదయం సంకోచం తో నిండి పోయింది

వాకిలి మధ్యగా ఉన్నఆ ఆపిల్ చెట్టు
చరఖా చుడుతున్న అమ్మ దగ్గరికి
నేను పరుగున వెళ్లి వాటేసుకున్న
దృశ్యమేదో గుర్తు చేస్తోంది

తలకు కట్టుకున్న స్కార్ఫ్
దుఃఖం తో తడిసిపోయింది
అమ్మ ప్రేమ తో 'కళ్ళు నిండి పోయాయి

విధిని తిరస్కరించడానికి నేనెవరిని ?
ఈ స్తంభాలను కౌగలించుకుని
వదిలి వెళ్లిన బాల్యాన్ని
లక్ష్యం లేని ఆటల పాటలని
కట్టుకున్న పక్షుల గూళ్ళనీ
మళ్ళీ రమ్మని పిలవనా ?

అమ్మా !
నువ్వెందుకమ్మా కూతుళ్లనే కన్నావు ?
నాన్నా!
పిలిస్తే కూడా రాలేనంత దూరం ఇచ్చి
మా పెళ్లిళ్లు ఎందుకు చేసావు

యాష్ శర్మ ఒక గుండె పట్టని దుఃఖాన్ని చిన్న చిన్న పదాలలో ఎంత అద్భుతం గా చిత్రించాడో చూడండి . మగ పిల్లాడు అయితే ఇంట్లోనే ఉంటాడు . కోడలే ఇంటికి వస్తుంది . అదే కూతురు అయితే మరొక ఇంటికి వెళ్ళాలి . ఉన్న ఊరిని , కన్న తల్లి తండ్రులను వదిలి ఒక కొత్త లోకం లోకి కూతురు వెళ్ళిపోవాలి . అప్పుడు కణ్వ మహాముని ఆశ్రమం లో శకుంతల కూడా చెట్టునూ , పుట్టనూ పట్టుకుని ఇలాగే విలపించి ఉంటుంది కదా . ఈ కవిత ఎప్పుడో 1980 లలో రాసింది . ఇప్పుడు చాలా పరిస్థితులు మారిపోయాయి . అయినా దుఃఖానికి , మానవ జీవన వేదనకి మరణం లేదు కదా . యాష్ శర్మ దే మరొక కవిత చూడండి

జ్ఞాపకాలు తిరిగి వచ్చినప్పుడు
హృదయ శిఖరం మీదుగాసంధ్య జారుతోంది
జ్ఞాపకాలు తిరిగి వచ్చినప్పుడుబాధ వుబ్బుతోంది

బాధ అపరిచిత,హృదయం నాది అయినప్పటికీ
ఎవరికోసమో స్పందిస్తోంది

కళ్ళెందుకిలా విశాలం అవుతున్నాయి
కేవలం ఒక చిన్న కాలిక క్షణాన్ని మాత్రమే

హృదయ సరస్సు చుట్టూపాచి పేరుకుంటోంది
ఒంటరితనాన్ని నిలుపుకోవడానికి
పెనుగులాడుతున్న కౌలు దారుడిలా
హామీలు అన్నీ నెరవేర్చాననిఅతడన్నాడు
నేను కాదు అన్నాను

ఈ సందిగ్ధతను
ఎవరు నిర్ణయిస్తారు ?

ఎవరు అర్థం చేసుకుంటారు ?
పాపం ? పిచ్చి కవి

ఆకాశాన్ని అడిగాడట
సుతిమెత్తని జనవరి మాసపు సూర్యుడు

నిండు గ్రీష్మం లో
ఆకాశం లోకి ఎలా వస్తాడు ?

ఒక బాధామయ జ్ఞాపకం హృదయాన్ని ఎంతలా కోస్తుందో ఈ కవిత చదివితే అర్థం కావడం లేదూ ? జనవరి మాసపు లేలేత సూర్యుడు చండ ప్రచండపు గ్రీష్మ ఋతువులో ఆకాశం లోకి ఎలా చొచ్చుకుని వస్తాడు అని అమాయకంగా అడగడమే లోనే వుంది అసలు కవిత్వ సౌందర్యమంతా యాష్ శర్మ తన రెండవ కవిత్వ సంపుటి "హు మే ఉతీం నహీ రోహండా "( ఇప్పుడు ఇక ఎంతమాత్రమూ అక్కడ జీవించలేను ) తరువాత తన మూడో కవిత్వ సంపుటి "బూంద్ త్రైలు ది " ( మంచు బిందువు ) తాజా గా వెలువరించాడు . ఈ కొత్త కవిత్వ సంపుటి లో శిల్ప పరంగా తను చాలా ప్రయోగాలు చేసాడు . రుబాయీల పద్ధతిలో ప్రతి కవిత కేవలం నాలుగు పంక్తులు మాత్రమే ఉంటుంది . అయితే రుబాయి ఛందస్సు ఇందులో ఉండదు . కవిత ప్రాణం అంత ఒక్క పంక్తి ( ఒక్క మంచు బిందువు ) లో చెప్పి మిగతా మూడు పంక్తులలో ఆ భావాన్ని తగిన ఉపపత్తులతో బలపరచడం కనిపిస్తుంది . శీర్షిక లాగే సున్నితమైన భావాలు , తాజా దృక్పథాలు , జీవితాన్ని గురించిన సరి కొత్త ,అతి పాత తత్వచింతనల nuances సంగమించిన సరి కొత్త భావ ధార అది తాను రాసిన ఒక కవిత లో శర్మ ఇలా అంటున్నాడు

జనన మరణాల వలయం నుండి
నాకు విముక్తి అవసరం లేదు
నా కోసం ఒక అందమైన మృత్యువు వేచి వుంది

ఈ జన్మ లో కలయిక అసాధ్యమైతే
వచ్చే జన్మ లో అది నన్ను వరిస్తుంది
జనన మరణాల శాఖా చంక్రమణమే జీవితం
యాష్ శర్మ తత్వ చింతనతోమనం ఏకీభవించవచ్చు , విభేధించవచ్చు . కానీ కవిగా అతడి శక్తి సామర్థ్యాలు మనలని అబ్బురపరచక మానవు . 2011 లో 82 సంవత్సరాల వయసులో ఆయన పెన్ను మూశారు

**- వంశీకృష్ణ, 95734 27422**



# తెల్లవెంట్రుకలు దోమలు గారడీలు

మరణించే ముందు దోమా అనుకుంటుంది
నన్ను దొరికించుకున్నావని ఆనందపడకు
నీ తలమీద తెల్ల వెంట్రుక లాంటిదాన్ని
కత్తిరిస్తున్న కొద్దీ పుట్టుకొస్తుంటానని

తెల్ల జుత్తే లేదన్నట్టు
నల్లరంగు వేసుకుంటావు
దోమలే లేవు అనేందుకు
సంహరించే మందేస్తావు
తెరలు తెరల్లో దాక్కుంటావు
ఏదైనా ఎంత తాత్కాలికం?

గుండు గీయించుకునో
అనారోగ్యంతో పడుండో
తెల్లజుత్తు పట్టించుకోనట్టు
ఇల్లు తాళం వేసినపుడో
ఇంటిలో ఎవరూ లేనపుడో
దోమలకెంత హాయి హాయో

కనిపించని తెల్లవెంట్రుకకే
బాధపడిపోయి కత్తిరించేసుకుంటావు
సరిగ్గా చెవి దగ్గరే దోమలు
గీపెడుతున్నాయని
విసుక్కుని చెవినే చెళ్లుమనిపిస్తావు
తెలియనిదల్లా
కనిపించని తెల్లవెంట్రుకల లానే
చెవిలేని చోటుల్లోనూ దోమలే

తెల్లవెంట్రుకలు కత్తిరిద్దామని
అద్దంలో చూసుకుంటూ
కత్తెరతో అనేక విన్యాసాలు
చేసుకుంటున్నట్టు
కొత్తగా ఇప్పుడు
దోమల్ని కాల్చిపారేయాలని
కరెంటు బ్యాటుతో గారడీలు

ఎన్నిచేసినా
తెల్లవెంట్రుకల లానే
ఏవీ పూర్తిగా పోని
వెధవ దోమలు
తెల్లవెంట్రుక వెక్కిరిస్తుందేమో
దోమమాత్రం కుట్టిచంపుతుంది


**- ముకుంద రామారావు**
**9908347273**

## భిన్నకోణాలలో పరిణతి చెందిన

# రాత్రిసింఫని కవి డా.బాణాల

కవుల్లో మూడు రకాలు ఉంటారు. కొంతమంది కవిత్వం రాయడం ద్వారాకవులయితే ఇంకొంతమంది ఇతరేతరకారణాలవల్ల కవులుగా చెలామణి అవుతుంటారు.కొంతమందేమోవారిని వారే కవులని అనుకుంటూ ఉంటారు. బాణాల ఈ మూడు రకాలలో మొదటి తరహాకు చెందిన కవి. జూలూరు గౌరిశంకరు చెప్పినట్లు బాణాల చాలా సీరియస్ కవి. ఒట్టొట్టిగా కాలక్షేపం కోసం డాంబిక ప్రదర్శన కోసం ఫెళఫెళారావాలు పోయి అందరూ నావంక చూడాలి అని కవిత్వం రాయడు.జీవితాన్ని చాలా sincere గా honest గా చిత్రిస్తూ, జీవితవాస్తవికతపట్ల ఒక బాధ్యత వహిస్తూ జీవితాన్నివ్యాఖ్యానిస్తూ,కవిత్వంలో ముందుకు పోతున్నకవి బాణాల.ఒక కవి సొంత గొంతుతో తనవైనఅనుభవాల్ని,ఆలోచనల్నితనదైన కళావ్యక్తీకరణ ద్వారా వ్యక్తీకరిస్తాడు.ఒకే ఆలోచనను ఒక వందమంది కవిత్వం రాసినా కవిగా నీ ప్రత్యేకతను పట్టించేది నీదైన గొంతుక. నీదైన వ్యక్తీకరణ. నీదైన శైలి.వస్తువుపట్ల నీదైన దృక్కోణం. ఇదే కవిగా నీ ప్రత్యేకతనుకవిత్వంలోనీది అని చెప్పుకోగలిగే నీదైన కంఠస్వరం.టోన్ అని అంటాం. అలా వస్తుపరంగా, శిల్పపరంగా బాణాల ముద్రని చూపించగలిగేదే ఈ "రాత్రిసింఫని".

బాణాలవ్యక్తిగతమైనస్పందనలోఏదోఒకరకమైనఆవేదన,అశాంతి,ఘర్షణకనపడితే!సామూహికస్పందనలోచాలస్పష్టమైనవ్యక్తిత్వవికాసదృష్టిఉంటుంది.మరొకవైపు చాలా అనిర్దిష్టమైన ఒకఆవేదన కనిపిస్తుంది. ఇవ్వాళ సమాజాన్నిపూర్తిగా మార్చుకునేఉద్యమాలు లేకుండా పోయినయే,ఒక అసమగ్రత చుట్టూమనం తిరుగుతున్నామనే వేదన కూడా కనపడుతుంది. ఎందుకంటే గతంతో పోలిస్తే ఇవాళ ప్రపంచం ఏ స్థితికి వచ్చిందంటే తేలిక పరిష్కారాలు ఇవ్వగలిగే స్థితి లేదు. గతంలో అన్ని సమస్యలకి intoto కొన్నిపరిష్కారాలు ఇచ్చారు.GrandNarratives అన్నారు వాటిని. ఇవాళ ప్రపంచ రాజకీయాలకి ఇదిగో ఇది సొల్యూషన్ అని చెప్పగలిగేటటువంటి క్లారిటీఈవాతావరణంలోకొరవడింది.దాన్నిపట్టించేటటువంటి కవితలుకూడా "రాత్రిసింఫని" లోఉన్నాయి. అయితే విభిన్నమైనటువంటి వస్తువుల్ని,ఇతివృత్తాల్నిఈకవిత్వంలోకీసుకువస్తూనే కొద్దిగా ఆశావహంగాకొంచం వికాసం వైపు కదులుతున్నట్టుగా కనిపిస్తాడు బాణాల. "రహదారుల్లోకి" అనే కవిత చూడండి.
నిజానికి ప్రాణం పోద్దామంటే /గజానికో ప్రమాదం



కలాలకు చీకటిగుహల ఆహ్వానాలు /గళాలకు లాఠీ కర్రల నాట్యవిన్యాసాలు
నిజంచెప్పటం కోసం జరిగేఉద్యమాలుఎంత చిన్నవైనా,ఆదారుల్లో మనం నడవాల్సిన ఆవశ్యకతను కచ్చితంగా చెపుతున్నాడు.అదితెలంగాణ,బహుజన,స్త్రీవాద,పర్యావరణఏఉద్యమమైనాకావొచ్చు.పర్యావరణంమీద "సీతాకోకచిలుక" లాంటి అద్భుతమైన కవిత రాశాడు.తెలంగాణ సమస్య మీద రాశాడు . స్త్రీలమీదరాశాడు. "జీవితంముళ్ళపాన్పుఅయినప్పుడుఓడిపోయిన ఆటల ఆలోచనేవద్దు". ఆటలో ఓడిపోవడం గెలవడం అనేది ఉంటుంది. అసలుజీవితంఅడుగడుగునాఏదోఒకసమస్యతోఏదో ఒకబాధతో,ఏదోఒకఅసమగ్రతతో,అభద్రతతోఉన్నప్పుడు గతంలోఓడిపోయినఆటలగురించిఆలోచించేతీరికఓపికఉండదు. అందుకే.
జీవితంముళ్ళపాన్పు అయినప్పుడు/ఓడిపోయినఆటలఆలోచనేవద్దు
....అని ఇలా కొత్త ఉద్యమాలని కూడా ఆహ్వానిస్తున్నాడు.
రాలిపడుతున్నపూలపరిమళాల గాయాలను చూడాలి
ఆ గాయాలకు కనీసం చూపులేపనం రాయాలి
ఇది టిపికల్ బాణాలశ్రీనివాస్ కంఠస్వరం. ముందుమాటకర్త మిత్రుడు సిద్ధార్థ చాలా మనసుపెట్టి చాలా సీరియస్ గా అదే మూడ్ లోకి మనల్ని తీసుకెళ్లేటట్టుగా రాశాడు.ఆయన దీనికి అస్తిత్వచేతనంలో రాసినటువంటి కవిత్వం అనడంలో రెండు అర్థాలు ఉన్నాయి. అస్తిత్వఉద్యమాలుఏవైతే మనంఅంటున్నమో ఆ ఉద్యమాలస్ఫూర్తి ఒకటైతే, తాత్వికంగా existentialism దానికి సంబంధించిన anxietyకూడా ఈ poems లో ఉంది. ఆ క్రమంలో చూసినప్పుడు ఆ గుంజాటనanxietyకి తోడుబహుజనకవిత్వాన్ని రాశాడు. "ఇకనైనా మెల్కోందాం", "బహుజనం" అనే పోయెమ్స్. ఈ "బహుజనం" అనే కవితలోబీ.సీ. కులాలకు సంబంధించిన ఆత్మగౌరవకంఠం ఏదైతే ఉందో దాన్ని glorifyచేస్తూ చాకళ్ళు, మంగళ్ళు, కంసాలీలు,పద్మశాలీలవృత్తులనేపథ్యంలోని వేదనను,సంవేదనను పట్టుకొని వాళ్ళతరుపున, వాళ్ళమధ్య నిలబడి మాట్లాడుతున్నట్లుగారాశాడు. దీన్నే "ఇకనైనా మెల్కోందాం" అని జనరల్ గా చెబుతూ...
ఇప్పుడు మా గొంతుల కాలువల్లో /మాటలు తిరుగుబాటు పాటలై
అణకువని చిలికిన మాకళ్ళే నిప్పుల కణికలై...
అని చాలా గొప్పగా ఒక బహుజనవాయిస్ ని సామూహికగొంతును వినిపించాడు. ఇక "ఏకత్వంలో భిన్నత్వం" లోమతోన్మాదాన్ని, ఇవాళ నడుస్తున్నటువంటి ఫాసిస్ట్ క్రూరత్వాన్ని చాలా subtleగా కవిత్వం చేశాడు.
గుండెల్లో మతం పులి పిడుగులైతే
కన్నీళ్ళదోసిళ్లతో అరచేతిలో ప్రాణాలు
అంటే ఒక verbతో sentenceend కావట్లేదు. నగ్నముని పెట్టినటువంటి ఒక ఒరవడి ఉంది తెలుగు కవిత్వానికి. ఒక nounతో end అవుతుంది వాక్యం." కాఫీలోరేగిన పరిమళాలు" అంటాడు. గతంలో verb తో sentenceend అయితే ఇప్పుడు ఒక nounతో end అయ్యే పద్ధతి వచ్చింది. బాణాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది.
కాలం ఘనీభవిస్తే/క్షణమొక రెక్కవిరిగిన పక్షి
ప్రశ్నలవల్మీకాల్నిపరిష్కరించలేని
సమాధానాల సరీసృపాలు
ప్రశ్నలకోసం కాదు సమాధానాల్ని చూసి భయపడే పరిస్థితి వచ్చింది ఇవాళ. "సమాధానాల సరీసృపాలు" అనే పదబంధం చాలా కొత్తగా అనిపించింది. "హింస పరమధర్మమైనవేళ ఏకత్వంలో భిన్నత్వం". భిన్నత్వంలో ఏకత్వం కాదుఏకత్వంలోనేభిన్నత్వం. నువ్వుఏదైతేఏకత్వం,ఏకగొంతుఅనుకుంటున్నావో అందులో విభిన్నగొంతులున్నాయి. ఆ విభిన్నగొంతుల్నిఅర్థం చేసుకొని కనిపెట్టలేకపోవడం అనేదే ఇవాల్టి రాజకీయ దారిద్ర్యం. అదే ఇవాల్టి ఫాసిజం యొక్క అసలైన స్వరూపం.
"ఫీనిక్స్ తెలంగాణ" అని కూడా ఒక మంచి కవిత రాశాడు. ఒక ఫీనిక్స్ పక్షి చితాభస్మం నుంచి పైకి లేచినట్లు తెలంగాణ తిరిగి పైకి లేస్తుంది.గత పాలకులు చేసినటువంటి క్రూరత్వం తాలూకు చితాభస్మం నుంచి కావొచ్చు. ఈనాటి పాలకులు చేస్తున్నటువంటి రాజకీయపరమైనటువంటి ఒక వాతావరణం నుంచి కావొచ్చు.తెలంగాణ ప్రజలు, తెలంగాణఆలోచన,తెలంగాణచైతన్యంఒకఫీనిక్స్ పక్షిలాగా ముందుకు పోతుందంటాడు.బాణాల ప్రతిఘటనాత్మకంగా,గట్టిగా కఠోరంగా మాట్లాడడు. కొంచం నర్మగర్భంగా మాట్లాడతాడు. కాస్త గుప్తత ఉంచుతూ మాట్లాడతాడు. ఇక్కడ "గ్లోబల్ నేరస్థుడు" లో చూడండి కట్టలు తెంచుకున్నఆవేశం.
దేశాధ్యక్షున్ని కూలదోసి
మరణశిక్షవేయించి మట్టు బెడితే/ఇది ఏధర్మం?
ప్రపంచ ప్రజలుకన్నీటి అక్షరాలతో/నీముఖానచెక్కే మరణశాసనాన్ని
తప్పించుకోలేవు ఖబడ్దార్!!....అని పోయెం end చేశాడు.
ఇది బాణాల వాయిస్కి కొంచం భిన్నమైన వాయిస్. ఎందుకంటే వస్తువు ఆవేదన అలాంటిది. "రాత్రిసింఫనీ"ఏదోఒకరకమైనఆవేదన,నిర్వేదం,రాత్రిపూట,ఒకబాధ,ఒకమంద్రమైనటువంటిఒకవిషాదవాతావరణాన్నిప్రతిబింబించే కవిత. "ఇతిహాసగాయం" అనే కవితలో...
తనను తాను తవ్వుకుంటున్న/నిద్రరాని నిశ్శబ్దపు నిశిరాత్రి
గతంగూట్లోంచి నక్షత్రపుకళ్ళతో/తొంగిచూస్తున్నమానవేతిహాస మానని గాయాలు
ఇలా ఒక తాత్వికమైనటువంటి చింతనాత్మకవ్యక్తీకరణ తన కవితల్లో కనిపిస్తుంది.ఇంతకుముందు కంటే ఇందులో ఒక సమగ్రమైన, నిండైనటువంటి కవిగా maturity వాయిస్ తో బాణాల కనిపిస్తాడు. అలాగే ప్రపంచాన్ని వ్యక్తిగత జీవితాన్ని, సామాజిక జీవితాన్ని qualitativeగా జల్లెడపట్టి, ఆ గట్టిగింజల్ని మనకు కవిత్వంగా అందించిన బాణాలలో ఒక బహుజనకవే కాక సామాజిక, రాజకీయ, సామ్రాజ్య వ్యతిరేక, తాత్విక,వ్యక్తివాదకవి కూడా ఉన్నాడు. ఈనాటి జీవితపు సంక్లిష్టత ఇది పరిష్కారం ఇదమిద్ధంగా ఇది చేయాలి ఇది చేయకూడదనే స్పష్టతా రాహిత్య వాతావరణాన్నికూడా కర్ణాకర్ణిగా చూచనప్రాయంగా మనదృష్టికి తెచ్చినందు వల్ల ఈ పుస్తకం చాలా ఆసక్తిదాయకంగా ఉంది.

**("రాత్రిసింఫని"ఆవిష్కరణ సభలో చేసినఉపన్యాసానికి సంక్షిప్త రూపం)**

**- గుంటూరు లక్ష్మీనరసయ్య**
**సెల్:98494 08204**

# శబ్ధ రహస్యం

నేను మనోసంద్రాన తేలిపోతున్నాను.
నిశ్శబ్దం ప్రాచీన వచనమై ఆహ్వానం పలుకుతోంది.
ఘర్షణ తరంగాలు నిలువెత్తు శిలలుగా మారి
అణువణువులోనూ ఆచేతనా ముద్రల్ని వదిలి
వెళుతున్నాయి.

విచిత్ర తారలవలె మినుకుమంటున్న ఆలోచనలు,
మధ్యరాత్రి అలలపై మెరుస్తూ మాయమవుతున్నాయి..
కోరికలు, ఆశలు దుఃఖపు గాలిలో కదలలేని ప్రతికృతులై
ఆరంభం, అంతం చిహ్నలతో ప్రశ్నల్ని సంధిస్తున్నాయి.

ఉదయ కాంతుల ఊపిరితో దిక్సూచి ఊగుతుంది,
కలలవైపు, సందేహాలవైపు, పేరులేని తపనలవైపు.
నలుదిశలా చిమ్మే స్వర నిర్భంధాలలో బంధీలై
చివరకు ఆత్మ తీరమై స్థిరంగా మిగిలిపోతుంది.

నాలో నేనే సుప్తమై, ఒక జలచరమై,
నిత్యం మారుతున్న కెరటాల మధ్య
నా ప్రశ్నల బొమ్మల్ని పసిపిల్లల వలె చూసుకుంటూ
బాధలను బంగారు ముత్యాలుగా చూసుకుంటున్నాను.



జీవన జలరాశిలో మౌనమే నావికుడు,
మనసే ఓడ, పాదాలే గుర్తులు, ఆశలే నక్షత్రాలు.
అవే నన్ను నన్నుగాను, అనంతంగానూ
తాకే శూన్యపు వాకిలి వరకూ మోస్తూనే వున్నాయి.

ఏ దిక్కూ లేని దిక్కుల మధ్య
ఒక శబ్ధ రహస్యం నన్ను పలుకరిస్తోంది.
ఈ బతుకు సంద్రం నాకు శిక్షలా అనిపించినా,
అంతిమంగా ఇది ముక్తికి ద్వారమవుతోంది.

**- శైలజామిత్ర, 92909 00879**

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..


మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.


43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# 5న కేబినెట్ భేటీ



హైదరాబాద్, మహా: తెలంగాణ ఆవిర్భావ సంబురాల వేళ శుభవార్తల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు.. ఆచితూచిగా పకడ్బందీగా ముందుకెళ్తామని తెలంగాణ కేబినెట్ సంకేతాలిచ్చింది. ఈ నెల 5న తెలంగాణ కేబినెట్ సమావేశం నిర్వహించి కీలక అంశాలను చర్చించాలని మంత్రుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఆదివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్ర అవతరణ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వానకాలం పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసం అంశాలపై మంత్రులు అందించిన నివేదికపై సమావేశంలో చర్చించారు. మే 29, 30 తేదీలలో జిల్లాల్లో పర్యటించిన మంత్రులు ఈ నాలుగు అంశాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించారు. అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తుది జాబితాలు, రెవిన్యూ సదస్సుల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లాల వారీగా తయారు చేసిన నివేదికలపై సమావేశంలో వివరించారు. రాజీవ్ యువ వికాసానికి ఊహించినదానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు యువ వికాసం అందకుండా చూడాలని పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని మంత్రులు ముఖ్యమంత్రి కి వివరించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. మరింత లోతుగా విశ్లేషించి లబ్ది దారులను గుర్తించాలని నిర్ణయించాలన్నారు. ఒక్క అనర్హుడికి కూడా రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరవద్దన్నారు. ఈ అంశంపై కేబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీకి సంబంధించి అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇప్పటికే నివేదిక అందించారు. ఆ నివేదికపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు వివరించారు. దీనిపై కేబినెట్ లో చర్చించి సమస్యల పరిష్కారంపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోనున్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మంత్రులు అభినందించారు.

**కీలక చర్చ వీటిపైనే...**




## అమరుల త్యాగాలు ఫలించిన రోజు

**ప్రత్యేక రాష్ట్రం కోసం దశాబ్దాలుగా కలలు కన్న తెలంగాణ ప్రజల కల సాకారమైన రోజు**

**ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు కంది శ్రీనివాస రెడ్డి**



**ఆదిలాబాద్ మహా :** తెలంగాణలో అసలు సిసలైన ప్రజాపాలన కొనసాగుతోందని ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రజల దరికి చేరుతున్నాయని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రజలందరికి ఆయన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసినా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు విలువనిచ్చిప్రత్యేక రాష్ట్రాన్ని ప్రసాదించి ఏళ్లుగా తెలంగాణ ప్రజలు కన్నకలలను నిజం చేసిన దేవత తెలంగాణ తల్లి తమ ప్రియతమ నాయకురాలు సోనియా గాంధీకి ఈసందర్భంగా పాదాభివందనాలు తెలుపుతున్నామన్నారు. కొత్త రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రజలు ఆరు గ్యారెంటీలు మహాలక్ష్మి పథకంలో 500లకే గ్యాస్ సిలిండర్. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం. రైతు భరోసా, గృహ జ్యోతి కింద ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా.ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం లాంటి పథకాల అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఇవేకాకుండా యువతకు ప్రభుత్వం వివిధ శాఖల్లో సుమారు 57వేల ఉద్యోగాలిచ్చిందని గుర్తు చేసారు.డీఎస్సీ ద్వారా 11,062 ఉపాధ్యాయ పోస్టులు. 8,304 రెసిడెన్షియల్ స్కూల్ ఉపాధ్యాయులు పోస్టులు.8,304 కానిస్టేబుళ్లు పోస్టులు. స్టాఫ్ నర్సులు 7,094 పోస్టులు.గ్రూప్4 ఉద్యోగాలు 8,143 పోస్టులు.సివిల్ అసిస్టెంట్ సర్జన్లు , ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు 466 పోస్టుల్లో ఉద్యోగ కల్పన జరిగిందన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం 202425 సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాల భర్తీ లక్ష్యంగా పెట్టుకుందని ఈ లక్ష్యాన్ని సాధించేందుకు, త్వరలో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని యోచిస్తోందన్నారు. ఇవి కాకుండా ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ, వరి ధాన్యానికి 500 బోనస్. రైతుల సంక్షేమానికి సన్న బియ్యానికి మద్దతు ధర చెల్లిస్తూ రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణి, భూభారతి రెవెన్యూ చట్టం ,సాగు పద్ధతుల అభివృద్ధి వంటి పలు అంశాలతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు కాంగ్రెస్ పాలనపై విశ్వాసాన్ని కలిగి ఉన్నారని తెలిపారు. ఇక కొత్త రాష్ట్రంలో పార్టీ పరంగా ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ , రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ల ఆదేశాలు సలహాలు సూచనలు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో తనదైన శైలిలో అద్భుత ఆలోచనలతో అంతకు మించిన కార్యాచరణ తో గతంలో కంటే పార్టీ మరింత బలోపేతమయ్యిందన్నారు. ఆయన ఆదేశాలు సూచనలతో ఇక్కడ ఆదిలాబాద్ లో కూడా ఇటీవల టీపీసీసీ నేతలు జిల్లా పరిశీలకుల ఆధ్వర్యంలో జిల్లా, నియోజక వర్గ , మండల, పట్టణ స్థాయిలో విజయవంతంగా విస్తృత సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ పటిష్టత కోసం కలిసికట్టుగా పని చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన ప్రజలకు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నవారందరికి హృదయపూర్వ కృతజ్ఞతలు తెలుపుతూ మరొక్కసారి రాష్ట్రఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియ చేసారు.



## కూలిన షాద్ నగర్ ఎక్సైజ్ కార్యాలయ పైకప్పు

- కానిస్టేబుల్ విజయ్ కుమార్ కు తీవ్ర గాయాలు
- ప్రాణాపాయస్థితిలో ఉన్న కానిస్టేబుల్ ను హైదరాబాద్ కు తరలింపు

**మహా:** కాలం చెల్లిన ఎక్సైజ్ ప్రభుత్వ కార్యాలయం భవనం పైకప్పు అకస్మాత్తుగా కొంత భాగం కూలడంతో ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం రంగారెడ్డజిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఫరూక్ నగర్ లో ఉన్న ఎక్సైజ్ శాఖ కార్యాలయం పైకప్పు కొంత భాగం కూలింది. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విజయకుమార్ పై పడడంతో తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. వెంటనే మిగతా సిబ్బంది గాయపడిన విజయ్ కుమార్ ను ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అతని పరిస్థితి విషమిస్తుండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించనున్నట్లు పేర్కొన్నారు. ఎప్పుడో కాలం చెల్లిన ఎక్సైజ్ శాఖ భవనం పైకప్పు కూలడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. భవనం నిర్మించి చాలా సంవత్సరాలు అయిందని స్థానికులు చెబుతున్నారు. కాలం చెల్లిన భవనం కాబట్టి ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సంఘటనతో స్థానికులు ఒకసారిగా కంగుతిన్నారు.

## శాస్త్రీయ పద్ధతిలో సర్దుబాటు చేయాలి

**టీ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం**



**ఆదిలాబాద్, మహా:**

ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన వర్క్ అడ్జస్ట్మెంట్ (సర్దుబాటు) ఉత్తర్వులను సవరించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీ యూటీ ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘం కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 మంది విద్యార్థుల వరకు ఇద్దరే ఎస్జీటి ఉపాధ్యాయులను నియమించడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని 1:20 కి తగ్గించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఐదు గురు ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం బడిబాట జరుగుతున్న సందర్భంలో సర్దుబాటు చేయడం సరికాదన్నారు. బడిబాట తర్వాత విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, ఈ పెరిగిన విద్యార్థుల సంఖ్య కనుగుణంగా సర్దుబాటు చేయాలన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ ల వల్ల చాలా పోస్టులు ఖాళీ లయ్యాయని, విద్యా సంవత్సరానికి ముందే పదోన్నతులు కల్పించినట్లయితే ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందన్నారు.పెండింగ్ డిఎ లను విడుదల చేయాలని, పిఆర్సి అమలు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. శ్రీకాంత్, ఎం.జలంధర్ రెడ్డి,రాష్ట్ర సహాధ్యక్షురాలు ఆర్.సుజాత, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు గంగ్రత్ నారాయణ, ఆర్.రామారావు అర్ష రమేష్, బేర దేవన్న ఎంఈఓలు డి.సోమయ్య, కే. నర్సయ్య ,వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## పట్నంలో కేటుగాల చేతివాటం పుస్తెలతాడు చోరీ

**వృద్ధ దంపతులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు.. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసిపి రాజు**



**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మహిళ మెడలోంచి మంగళసూత్రం చోరీ కలకలం. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ మంచాల్ రోడ్డులో ఆదివారం ప్రభుత్వ బాలికల పాఠశాల ముందు నుండి బస్టాండ్ వైపు, నోముల గ్రామానికి చెందిన వృద్ధ మహిళ మాదరమోని లక్ష్మమ్మ(70) భర్త నర్సింహా, నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఆమె మెడలోంచి సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడును లాకెళ్లిన గుర్తుతెలియని దుండగుడు. లబోదిబోమని గుండెలు బాదుకొని నిస్సహాయురాలుగా ఉండిపోయింది. అనంతరం వృద్ధ దంపతులు, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఫిర్యాదు అందుకున్న అనంతరం ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజు, సిఐ ఐ జగదీష్ తో కలిసి ఘటన స్థలాన్ని పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. దొంగ కోసం పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్టు ఏసిపి కెపివి రాజు తెలిపారు.



## కళ్యాణ వేడుకలో కంది శ్రీనన్న

**ఆదిలాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి పలు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. మంచిర్యాల పర్యటన లో ఉన్న ఆయన ఆదివారం టీపీ సీసీ జనరల్ సెక్రటరీ చిట్ల సత్యనారాయణ కుమారుని వివాహ వే డుకలో పాల్గొన్నారు. నూతన వధూవరులకు కంది శ్రీనన్న పెళ్లి కనుక అందించి శుభాకాంక్షలు తెలిపారు. అయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

## నేడు జిల్లాకు షబ్బీర్ అలీ రాక

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ హాజరుకానున్నారు. ఆదివారం రాత్రి ఆదిలాబాద్ పట్టణానికి చేరుకోనున్నారు. సోమవారం ఉదయం 9.35 గంటలకు ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారు.అనంతరం తెలంగాణ చౌక్ వద్ద ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు సమర్పిస్తారు.ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు.అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం ఉదయం 10.35గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో తేనీటి విందుకు హాజరుకానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## బీసీల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశానికి వెళ్లిన జిల్లా నాయకులు

**కరీంనగర్, మహా:** హైదరాబాద్ లో జరిగిన బీసీల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనడానికి కరీంనగర్ జిల్లా నుండి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ లు బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో గల కళింగభవన్ లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీ లో చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో నామినేటెడ్ పదవులలో కూడా బీసీలకు జనాభా దామాషా ప్రకారం అవకాశం ఇవ్వాలని కోరారు. జిల్లా, మండల స్థాయిలో బీసీ వాదం బలంగా నిర్మించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుండి రాష్ట్ర ఉపాధ్యకుడు గ్రీకు రవీందర్, మోటుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



## చదువుకు పేదరికం అడ్డు కాదు ఇష్టపడి చదవాలి

**ఉత్తమ విద్యార్థులకు గౌరవ పురస్కారం**

**ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ బూడిద రాంరెడ్డి**



**రంగారెడ్డి మహా:** ఎస్ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్, ఎంసెట్ లలో 2025 సంవత్సరాని గాను ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన విద్యార్థులకు కే ఎం ఆర్ గార్డెన్స్ లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను బూడిద రాంరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి బహుకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఆర్వో వెంకటాచారి, ఎంపీడీవో నరేందర్ రెడ్డి, దమిషన్ ఫౌండర్ ఆఫ్ చైర్మన్, ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు హాజరై విద్యార్థులకు తమ నిజ జీవితంలో ఎదుర్కొన్న కష్టసుఖాలు కూలంకషంగా వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు 60 మందికి ప్రథమ బహుమతి, 60 మందికి ద్వితీయ, మరో 60 మందికి తృతీయ బహుమతులు, విద్యార్థులకు తల్లిదండ్రులతో పాటు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి పురస్కారాలు, జ్ఞాపికలు అందించి శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బూడిద రాంరెడ్డి మాట్లాడుతూ... చదువుకు పేదరికం అడ్డు కాదని ప్రతి ఒక్క విద్యార్థి ఈ విషయాన్ని తెలుసుకొని చాలా కష్టపడి అభివృద్ధిలోకి రావాలని తన చిన్ననాటి జ్ఞాపకాలను విద్యార్థులకు ఉదాహరణగా వివరించారు. కార్యక్రమానికి విచ్చేసినటువంటి ప్రముఖులను బూడిద రామ్ రెడ్డి ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పరిగూడ గ్రామస్తులు,పెద్దలు, మాజీ ఉప సర్పంచ్ బూడిద బూడిద నరసింహ్మారెడ్డి, రాయపోల్ మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డి జ్యోతి భాస్కర్ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఇందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఖిలా వరంగల్ లోని ఖుష్ మహల్ మైదానంలో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిప్యూటీ సిటీ పోలీస్ కమిషనర్ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి లతో కలసి పరిశీలించారు. సభా వేదిక, వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాల పై చేసే ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ పతాకం ఎగురవేయడానికి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరవుతారని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, గృహ నిర్మాణాల శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గణపతి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసిల్దార్ నాగేశ్వరరావు, మున్సిపల్ ఎం హెచ్ ఓ రాజేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పెరిగిన రేషన్ కార్డుల సంఖ్య

**2 లక్షల కొత్త కార్డుల లబ్ధిదారులకు రేషన్**



**వరంగల్ మహా;** తెలంగాణలో రేషన్ కార్డుల లబ్ధిదారుల సంఖ్య 3.10 కోట్లకు పెరిగింది. గతంలో 2.83 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులు ఉండేవారు. అంటే ఇప్పుడు 27 లక్షల మందికి పైగా కొత్తగా అర్హత పొందారు. కాగా మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 91.83 లక్షలకు పెరిగింది. గతంలో కంటే 2 లక్షల కొత్త కార్డులు జారీ అయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ లో ఉన్న దాదాపు 20 లక్షల అప్లికేషన్లను వెరిఫికేషన్ చేయగా, 18 లక్షల మందికి అర్హత లభించింది. జూన్ నెలలో మూడు నెలలకు సంబంధించిన 18 కిలోల సన్న బియ్యం ఒక్కో లబ్ధిదారుడికి ఒకేసారి ఇవ్వనున్నారు. ఫిబ్రవరి 17 నుంచి మీ సేవ ద్వారా వచ్చిన అప్లికేషన్లు, గ్రామసభల ద్వారా వచ్చిన దరఖాస్తుల పై కార్యాచరణ చేపట్టారు. కొత్తగా జారీ చేసిన 2 లక్షల కార్డుల కింద 9 లక్షల కొత్త లబ్ధిదారులకు రేషన్ లబ్ధి చేకూరుతుంది. లబ్ధిదారుల సంఖ్య పెరగడం ద్వారా అధిక మంది ప్రజలకు ప్రభుత్వ సాయం అందు తోంది. పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయడం ద్వారా లక్షల మంది అర్హులైన ప్రజలకు లబ్ధి చేకూరుతోంది. మిగతా దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. కొత్తగా దరఖాస్తులు చేసుకునే వారికి సంబంధించిన వెరిఫికేషన్‌ను కూడా నిర్వహిస్తామని, రేషన్ అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

## నేడు కలెక్టరేట్లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### జెండావిష్కరణ చేయనున్న వేం నరేందర్ రెడ్డి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నేటి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ తరుణంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముస్తాబయింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి సలహాదారు ప్రభుత్వ విప్ వేం నరేందర్ రెడ్డి హాజరుకానున్నారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించి, కార్యాలయ ఆవరణంలో జాతీయ జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు కలెక్టర్ సి నారాయణరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను, వివిధ శాఖల అధికారులను ఆహ్వానించినట్లు తెలిపారు.

## మంత్రి పదవి వస్తుందని నమ్ముతున్నా..

### పార్టీ అధిష్టానంపై నాకు నమ్మకం ఉంది

- ఎవరికి మంత్రి పదవి ఇవ్వాలో హైకమాండ్ చూసుకుంటది
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- బీఆర్ఎస్‌లో కవిత, కేటీఆర్, హరీశ్ రావుల కొట్లాటే నడుస్తోంది
- కేటీఆర్‌ను మెంటల్ ఆసుపత్రిలో చేర్పించాలని ఎమ్మెల్యే విమర్శలు



**మహా:** మంత్రి పదవిపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో తనకు మంత్రి పదవి వస్తుందని నమ్ముతున్నానని అన్నారు. పార్టీ అధిష్టానంపై నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. తన జన్మదినం సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి పూలమాలలతో ముంచెత్తారు. మునుగోడు శివాలయంలో పూజల అనంతరం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం, అన్నదానం శిబిరాలను రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలలో జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డితో పాటు, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ బంద్రు శోభారాణిలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో రాజగోపాల్ రెడ్డి చిట్ చాట్ చేశారు. నిజామాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి సహా పలువురు మంత్రి పదవులు ఆశిస్తున్నారని, ఎవరిని మంత్రి పదవి వరిస్తుందన్నది అధిష్టానం చూసుకుంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కవిత, కేటీఆర్, హరీశ్ రావుల కొట్లాటే సరిపోతుందని, ఇంకా వాళ్లు ప్రజల కోసం ఏం ఆలోచిస్తారని, వచ్చే ఎన్నికలనాటికి బీఆర్ఎస్ పార్టీ అనేదే ఉండదని జోస్యం చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఆయనను మెంటల్ ఆస్పత్రిలో చేర్పించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ పాలకులు ఒక్క ఇల్లు కట్టలేదని, రాష్ట్ర సంపదను అంతా దోచుకుతిని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆయన విమర్శించారు.

## ఖుషీ చిల్డ్రన్స్ & ఈఎన్‌టీ హాస్పిటల్ ను ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి



**బాలాపూర్ మహా:** మహేశ్వరం నియోజకవర్గం, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని బాలాపూర్ మిధానీ రోడ్డు లో నూతనంగా ఏర్పాటు చేసిన ఖుషీ చిల్డ్రన్ హాస్పిటల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. తక్కువ ధరకు మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని హాస్పిటల్ యజమానికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. 24×7 మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ ఈషత్ ముస్తఫా తెలిపారు. అనుభవజ్ఞులైన డాక్టర్లచే చుట్టు పక్కల ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన వైద్యం అందించాలని తమ లక్ష్యమని తెలిపారు. అత్యాధునికమైన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని అత్యవసర సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చిల్డ్రన్స్ కేర్ తో పాటు, ENT వైద్య సేవలు పిల్లలకు, పెద్దలకు హాస్పిటల్ లో అందుబాటులో ఉన్నాయని ప్రజలు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని డాక్టర్ సయ్యద్ ఈషత్ ముస్తఫా కోరారు. ఈ కార్యక్రమం లో హాస్పిటల్ నిర్వాహకులు, వైద్యులు, సిబ్బంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మహిళా అధ్యక్షురాలు సునీతా, జాగృతి నాయకుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు..

### షాద్ నగర్ లో రూ.7.5 లక్షల విలువైన

## నకిలీ పత్తి విత్తనాల పట్టివేత




**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో రూ.7.5 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు నమ్మదగ్గ సమాచారం మేరకు మేడ్చల్ ఎస్ఓటి ఎస్సై ధనుంజయ, స్థానిక ఎస్సై శరత్, వ్యవసాయ శాఖ ఇన్చార్జ్ ఏడి నిశాంత్ కుమార్ సంయుక్తంగా షాద్ నగర్ పరిగి రోడ్డు బకర్మన్ గార్డెన్ ఆపోజిట్ లోని ఖాళీ స్థలం దగ్గర నిషేధిత నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారని సమాచారం అందింది. అక్కడ ఆపి ఉన్న హోండా మొబిలియో ఏపీ 03 బిఏల్ 5204 నంబరు గల వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 300 కిలోల నిషేధించిన పత్తి విత్తనాలను గుర్తించడం జరిగిందనీ వ్యవసాయ అధికారి తెలిపారు. వీర వసంత రావు అనే వ్యక్తి అమరావతి మండలం పల్నాడు జిల్లా నుండి చంద్రలపాడు గ్రామము, ఎన్టీఆర్ జిల్లా వాస్తవ్యుడు అయిన జంపాని నాగేశ్వర్ రావు పరిగి పట్టణంలో ఉంటూ వికారాబాద్ మండలం ధ్యాచెర్ల గ్రామములో పొలం కౌలుకు తీసుకోని నిషేదిత పత్తి విత్తనాలను సాగు చేస్తూ పక్క రైతులకు అమ్మడానికి షాద్ నగర్ లోని పరిగి రోడ్ లో గల బక్కర్మన్ గార్డెన్ ఆపొసిట్ లో గల కాళీ స్థలంలో ఇట్టి నిషేదిత పత్తి విత్తనాలను ముగ్గురు రైతులకు అంటగట్టడానికి చూడగా పోలీసు మరియు వ్యవసాయ శాఖ వారు పట్టుకోవడం జరిగిందనీ తెలిపారు..ఇట్టి తనిఖీ కార్యక్రమంలో షాద్ నగర్ ఇన్చార్జ్ ఏడి అగ్రికల్చర్ నిశాంత్ కుమార్, ఫరూక్ నగర్ వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్ కుమార్, ఎస్సై శరత్, మేడ్చల్ ఎస్ఓటి ఎస్సై ధనుంజయ పాల్గొనడం జరిగిందనీ పేర్కొన్నారు..

# నేటి నుంచి స్లాట్ బుకింగ్ సేవలు

### డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్

- అన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ల్లో బుకింగ్
- 82476 23578 నంబర్‌తో వాట్సప్ చాట్‌బాట్ మేధా
- రిజిస్ట్రేషన్ల వేగవంతానికి ఆధార్-ఈ సంతకం ప్రవేశ పెడుతున్నాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**మహా:** స్లాట్ బుకింగ్‌తోపాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్‌ఈ సంతకం ప్రవేశపెడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మక అమలుచేస్తున్నామని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు, మనోభీష్టం మేరకే ప్రజా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకొని అమలుచేస్తుందని.. అంతిమంగా ప్రజలకు సంతృప్తికర సేవలు అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నేటి నుంచి స్లాట్ బుకింగ్ విధానంతో పాటు కృత్రిమ మేధ (ఎఐ) సేవలను ఉపయోగించుకొని ప్రజలకు మరింత సులువైన సమర్థవంతమైన సేవలను అందించబోతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను ఇప్పటి వరకు ప్రయోగాత్మకంగా రెండు విడుతల్లో 47 చోట్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలుచేయగా తాజాగా జూన్ 2వ తేదీ నుంచి మిగిలిన 97 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయడానికి అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేయడం జరిగిందని పొంగులేటి వెల్లడించారు. స్లాట్ బుకింగ్ అమలుపై ఆదివారం స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకువస్తున్న నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆస్తుల క్రయ విక్రయదారులకు సమయం ఆదా అయ్యేలా పారదర్శకంగా అవినీతి రహితంగా మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానం వల్ల అనుకున్న విధంగానే సత్ఫలితాలు వచ్చాయన్నారు. 94 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. మొదటి దశలో 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఏప్రిల్ 10 నుంచి ఇప్పటివరకు 30,592 డాక్యుమెంట్లు , రెండో దశలో 25 సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మే 12 నుంచి ఇప్పటివరకు 14,099 డాక్యుమెంట్లు మొత్తం 45,191 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగాయని.. స్లాట్ బుకింగ్ వల్ల మూడు వేల డాక్యుమెంట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ జరిగాయని తెలిపారు.

**మాడ్యూల్‌ను తీసుకువస్తాం..**

అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్లాట్ బుకింగ్ విధానంతో పాటు కృత్రిమ మేధ ( ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఎఐ) అనుసంధానంతో కూడిన చాట్‌బాట్ - మేధ 82476 23578 వాట్సాప్ నెంబర్ ను అందుబాటులోకి తీసుకువచ్చామని..ఈ నూతన ప్రక్రియ వల్ల రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి కలిగే సందేహాలు నివృత్తి అవుతాయని తెలిపారు. అంతేగాకుండా రిజిస్ట్రేషన్ ఆఫీస్ లొకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీల వివరాలు, సమయం అందుబాటు వంటి సమాచారం లభిస్తుందన్నారు. గిఫ్ట్ డీడ్, సేల్ డీడ్ పై రిజిస్ట్రేషన్ ఛార్జీలు మార్కెట్ ధరలు తదితర అన్ని అంశాలపై ఈ ఎఐ చాట్‌బాట్ - మేధ ద్వారా సమాచారం తెలుసుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు. అక్రమాలకు చెక్ పెట్టేలా లేఅవుట్‌లలో డబుల్ రిజిస్ట్రేషన్ జరగకుండా, రిజిస్ట్రేషన్ పూర్తయిన వాటి వివరాలు, పూర్తి కాని వాటి వివరాలు ఇటు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అటు బిల్డర్ లేదా డెవలపర్ దగ్గర వివరాలు ఉండేలా త్వరలో డెవలపర్ రిజిస్ట్రేషన్ మాడ్యూల్‌ను తీసుకువస్తామని మంత్రి తెలిపారు. ఈ మాడ్యూల్ లో రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్ల వివరాలు రెడ్ కలర్ లో కనిపిస్తాయన్నారు. స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో పని భారం అధికంగా ఉన్న పఠాన్‌చెరువు, యాదగిరి గుట్ట, గండిపేట, ఇబ్రహీం పట్నం , సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ మొత్తం తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు సిబ్బందిని కూడా నియమించడం జరిగిందని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి లంచ్ సమయాన్ని మినహాయించి సాయంత్రం 5 గంటల వరకూ స్లాట్ బుక్ చేసుకోవచ్చని.. ప్రతి కార్యాలయంలో రోజుకు 48 స్లాట్‌లు బుక్ అవుతాయని, స్లాట్ బుకింగ్ చేసుకోని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వడం జరుగుతుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

### ఛలో ఖమ్మం ఎల్ హెచ్ పిఎస్

## వాల్ పోస్టర్ ఆవిష్కరణ




**భూపాలపల్లి, మహా :** గిరిజన హక్కుల సాధనకై లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర స్థాయి ఉద్యమ కార్యాచరణ సభను జయప్రదం చేయాలని భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య నాయక్ అధ్యక్షతన రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి కృష్ణానాయక్ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఖమ్మంలో ఈనెల 8వ తేదీన ఐఎంఎ హాల్, పెవిలియన్ గ్రౌండ్ ఎదురుగా జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. భూపాలపల్లి జిల్లా మాలహర్రావు మండలం ఆడువాలపల్లి గ్రామంలో ఆదివారం జిల్లా ఎల్ హెచ్ పి ఎస్ సమావేశం నిర్వహించారు. ఖమ్మంలో నిర్వహించే సభలో పలు డిమాండ్లను పరిష్కరించాలని వాల్ పోస్టర్లు పేర్కొన్నారు. తెలంగాణ లో ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో లంబాడీల జనాభా బహిర్గతం చేయాలి. గొర్ బోలి భాషను అధికారికంగా గుర్తించి, కేంద్ర ప్రభుత్వం 8వ షెడ్యూల్ లో చేర్చాలి. ఎస్ టిల 10% రిజర్వేషన్ ను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్ లో చేర్చాలి, ఎస్ టి లను రిజర్వేషన్ ను కేంద్ర ప్రభుత్వం 7.5% నుండి 14%నికి పెంచాలి ,శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఐచ్ఛిక సెలవు దినంగా కాకుండా సాధారణ సెలవుదినం గా ప్రకటించాలి, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి, పోడు భూములకు పట్టాలు, లావణి భూములకు పట్టాలు ఇవ్వాలి, ప్రభుత్వం ద్వారా జారీ చేసిన ట్రైబల్ వెల్ఫేర్ G.O.Ms.No.18, తేది:16.07.2024 ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో 100% శాతం రిజర్వేషన్ అమలు చేయాలి, మైదాన ప్రాంతంలో ఎస్ టి (గిరిజనులు) కోసం ప్రతి జిల్లా కేంద్రంలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి. నూతనంగా ఏర్పాటైన ఎస్టి తండాల గ్రామపంచాయితీలను రెవెన్యూ పంచాయితీగా గుర్తించాలి. గ్రామపంచాయితీల అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ ను ఏర్పాటు చేయాలి. ఎస్ టిల కోసం ఏర్పాటు చేసిన సబ్ ప్లాన్ నిధులను గిరిజనుల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలి. పెండింగ్ లో ఉన్న ట్రైకార్ ఋణాలకు తక్షణమే నిధులు విడుదల చేయాలి. నిరుద్యోగులకు ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీ చేయాలి. నిరుద్యోగుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి. ఈ డిమాండ్ల సాధనకై గిరిజన ప్రజలు, మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంగారాభేరి , అజ్మీరా సమ్మయ్య నాయక్ (డీలర్ ), అజ్మీరా బాలాజీ, బానోత్ రాజేందర్, అజ్మీరా శంకర్, అజ్మీరా సమ్మయ్య, అజ్మీరా రాజు, బానోత్ ఉక్యా నాయక్, అజ్మీరా క్రిష్ణ, బానోతు సమ్మయ్య, బానోత్ శ్రీధర్గార్లు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు దశరథ్ నాయక్, జిల్లా నాయకులు. బానోత్ నందు నాయక్, పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాలలో వ్యవసాయ,

## పోలీస్ శాఖల సంయుక్త తనిఖీలు

### మరి కొన్ని రోజుల్లో టాస్క్ ఫోర్స్ టీమ్ ల తనిఖీలు



**భూపాలపల్లి, మహా :** ఖరీఫ్ సీజన్లో నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా ఉండేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో భూపాలపల్లి జిల్లాలో టాస్క్ ఫోర్స్ అధికారులు రంగంలోకి దిగారు. భూపాలపల్లి మహాదేవపూర్ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ల పరిధిలో రేగొండ, కాటారం, మహాముత్తారం, ఘనపూర్ మండలాల్లో పోలీసులు వ్యవసాయ శాఖ అధికారులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రైతులను నట్టేట ముంచుతున్న ఈ నకిలీ విత్తనాల నియంత్రణపై అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించనుంది. ఈ క్రమంలోనే టాస్కోఫర్స్ బృందాలు జిల్లాలోని దుకాణాలలో తనిఖీ నిర్వహించడంతోపాటు గ్రామాలలో అనుమతి లేకుండా విత్తనాలు విక్రయించే నకిలీ విత్తన ముఠాలపై నిఘా ఉంచారు. కాటారం డిఎస్పి జి రామ్మోహన్ రెడ్డి, ఏవో పూర్ణిమ ల ఆధ్వర్యంలో కాటారం, మహాముత్తారం మండ లాల్లో దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలు మందులు విక్రయించిన లూజు విత్తనాలు అమ్మిన కంపెనీ లోగో లేని విత్తనాలు విక్రయించిన ఎక్కువ ధరకు విగ్రహాలు చేపట్టిన అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి హెచ్చరించారు. షాపుల యజమానులు అధికారుల ఆదేశాలను ధిక్కరిస్తే రైతులు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేని బి జి3 పత్తి విత్తనాలు గ్రామాల్లో పెద్ద రైతులు విక్రయిస్తున్నారని పోలీసులకు పలువురు తెలిపారు. సాగు సీజన్ ఊపందుకున్న నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. వరుసగా మూడుసార్లు కంటే ఎక్కువగా పట్టుబడిన నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగించడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు రైతులలో నాసిరక విత్తనాలు కొనుగోలు చేయకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. విత్తన కొనుగోలు సమయంలో లేబుళ్లు సక్రమంగా ఉండేలా అధికారిక డీలర్ వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. నకిలీవి విక్రయించే అవకాశం ఉన్న బిజీ 3 పత్తి విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తద్వారా రైతులు నష్టపోరని వ్యాపారస్తులు తెలిపారు.

**మండలంలో బిజీ-3 రకం పత్తి విత్తనాల విక్రయం?**

వర్షాలు పడటం వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో నకిలీ విత్తనాలు ప్రత్యక్షమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుండి ఎక్కువగా నకిలీ విత్తనాలు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేని బిజీ3 రకం విత్తనాలను గత డిసెంబర్ నెల నుండి మండలంలోని ఒక గ్రామం నుండి రైతులకు విక్రయిస్తున్నారని, గ్రామాల్లోని కొంతమంది పలుకుబడి కలిగిన రైతుల ద్వారా ఈ విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

## బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావుకు ఘన స్వాగతం

### ఘనంగా స్వాగతించిన షాద్ నగర్ పట్టణ బిఆర్ఎస్ నాయకులు



**షాద్ నగర్, మహా:** బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు మహబూబ్నగర్ జిల్లా రాజాపూర్ మండల్, అంజన్న తండా మాజీ జడ్పిటిసి మోహన్ నాయక్ విందు ఆహ్వాన మేరకు వెళుతున్న సమయంలో కేశంపేట్ రోడ్డు చౌరస్తాలో షాద్ నగర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి సన్మానించారు.ఇందులో మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నటరాజ్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ నాయక్, మాజీ జెడ్పిటిసి వైస్ చైర్మన్ ఈట గణేష్, ఉప్పర గడ్డ తాండ మాజీ సర్పంచ్ చందు నాయక్, ఎస్సీ సెల్ సెక్రటరీ నర్సింగ్ రావు, బీసీ సెల్ నాయకులు విజయ్, లక్ష్మన్ నాయక్, చౌదర్ గూడా మండల్ టిఆర్ఎస్ నాయకులు మోతిలాల్ నాయక్, కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏ పదవి ఎవరికివ్వాలో వారికి ఇస్తారు

### ప్రజాభిప్రాయం మేరకు అధిష్టానం నియామకం

### ఎమ్మెల్సీ విజయశాంతి




**మహా :** ఎవరెవరికి పదవులు ఎప్పుడు రావాలో అధిష్టానం చూసుకుంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల ప్రకటించిన కొన్ని విభాదాలలో తనకు స్థానం దక్కక పోవడంపై స్పందిస్తూ సరైన సమయంలో పదవులు వస్తాయని, ఎవరికి పదవులు ఇవ్వాలో పార్టీ అధిష్ఠానానికి బాగా తెలుసని అన్నారు. గతంలో కొన్ని కమిటీల్లో తన పేరు లేకపోయినా, భవిష్యత్తులో మరో కమిటీలో అవకాశం దొరకవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. పదవుల కోసం తానెప్పుడూ పాకులాడలేదని, ప్రజల కోసం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ పని చేస్తూ వస్తున్నానని పేర్కొన్నారు. ఎవరు పార్టీ కోసం పని చేస్తున్నారు, ప్రజలు ఎవరిని ఏ బాధ్యతలో ఉండాలని కోరుకుంటున్నారన్న విషయాన్ని అధిష్టానం తెలుసుకుంటుందని, ఆ మేరకు నేతలకు బాధ్యతలను అప్పగిస్తున్నారన్నారు. విజయశాంతి వ్యాఖ్యలను కాంగ్రెస్‌లో ఆమె ఓపిక, పార్టీ పట్ల నిబద్ధతకు నిదర్శనంగా రాజకీయ విమర్శకులు పేర్కొంటున్నారు. అయితే కొందరు మాత్రం విజయశాంతి పార్టీలో ఇంకా కీలక పాత్ర కోసం ఎదురుచూస్తోందని విమర్శిస్తున్నారు.

## జీహెచ్ఎంసీ మాన్ సూన్ టెండర్లు రద్దు చేయండి

### సీఎం రేవంత్ కు లేఖ రాసిన ఎమ్మెల్సీ కవిత.. అధికారులు నిబంధనలను మార్చారని ఆరోపణ

### తెలంగాణకు చెందిన బీసీ కాంట్రాక్టర్లకు నష్టం వాటిల్లేలా నిబంధనలున్నాయని వెల్లడి



**మహా :** జీహెచ్ఎంసీలో మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, ఇన్‌స్టంట్ రిపేర్ టీమ్స్ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షాకాలంలో చేపట్టాల్సిన ఎమర్జెన్సీ పనుల టెండర్లలో కొందరు అధికారులు తమకు అనుకూలంగా ఉన్న సంస్థలకు లాభం చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయని ఆమె లేఖలో పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన బీసీ కాంట్రాక్టర్లకు నష్టం చేసేలా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఒక విదేశీ సంస్థకు చెందిన వాహనాలు మాత్రమే ఈ పనుల కోసం వినియోగించేలా నిబంధనలు రూపొందించారని కవిత ఆరోపించారు. ఆ సంస్థకు హైదరాబాద్‌లో రెండు షోరూములు మాత్రమే ఉన్నాయని అన్నారు. ఆ షోరూంల నిర్వాహకులు తెలంగాణకు చెందిన కాంట్రాక్టర్లతో ఎంఓయూ చేసుకునేందుకు ససేమిరా అంటున్నారని లేఖలో ప్రస్తావించారు. తెలంగాణ కాంట్రాక్టర్లు కర్ణాటక షోరూంల డీలర్ల నుంచి ఎంవోయూలు తెచ్చుకున్నా వాటి ఫిజికల్ కాపీలు తక్కువ వ్యవధిలో తెచ్చి ఇవ్వాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటి వరకు జీహెచ్ఎంసీలోని 150 వార్డులకు వేర్వేరుగా టెండర్లు పిలిచేవారని గుర్తుచేశారు. ఇప్పుడు తొమ్మిది జోన్‌ల వారిగా మాత్రమే టెండర్లు పిలవడంతో తెలంగాణ కాంట్రాక్టర్లకు నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. అంతేకాకుండా అధికారులు పేర్కొన్న స్పెసిఫికేషన్స్ కూడిన వాహనాల్లో ఒక క్యూబిక్ మీటర్ మెటీరియల్ కూడా తరలించడం సాధ్యం కాదని ఎమ్మెల్సీ కవిత వివరించారు. గతంలో ఇందుకు వినియోగించిన వాహనాల్లో రెండు నుంచి మూడు క్యూబిక్ మీటర్ల మెటీరియల్ తరలించేవారని స్పష్టం చేశారు. ఒక సంస్థకు, రెండు కాంట్రాక్టు ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చేలా అధికారులు నిబంధనలు మార్చడంతో ఒక్కో ఏడాదికి రూ. 5.85 కోట్ల అదనపు భారం పడుతుందని చెప్పారు. ఈ టెండర్లను వెంటనే రద్దు చేసి గతంలో మాదిరిగా వార్డుల వారీగా టెండర్లు పిలిస్తే 150 మంది స్థానిక కాంట్రాక్టర్లకు ఉపాధి లభిస్తుందని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ శాఖలో జరుగుతున్న అక్రమాలపై దృష్టి సారించాలని కోరారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.



# ఇంట్లో ఇలాంటి మొక్కలే పెంచుతున్నారు

ఇంట్లో స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలను పెంచుకుంటున్నారు. దాంతో అందం, ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. హోమ్ గార్డెనింగ్ మొక్కల ప్రత్యేకత ఏంటంటే.. వీటికయ్యే వ్యయం చాలా తక్కువ. నిర్వహణ కూడా తేలికే. పైగా అందంగా, అద్భుతమైన డిజైన్లతో అలంకారప్రాయంగా ఉంటాయి.

- ఇండోర్ గార్డెనింగ్‌పై ఆసక్తి ఉన్న వాళ్ల తొలి ప్రాధాన్యం స్నేక్ ప్లాంట్‌కే. నిర్వహణ అత్యంత సులువు. తక్కువ నీటి అవసరం ఉంటుంది. చీకటి ప్రదేశంలో, గది మూలల్లోనూ ఇది పెరుగుతుంది. తక్కువ కాంతిలో ఉంచినప్పటికీ.. స్వచ్ఛమైన ఆక్సిజన్ విడుదల చేస్తుంది. నిలువుగా పెరుగుతుంది.
- మధ్యస్థ స్థాయిలో సూర్యరశ్మి లేదా పరోక్ష పద్ధతిలో సూర్యకాంతిలోనూ పెరగడం రబ్బర్ ప్లాంట్ ప్రత్యేకత. దీనికి ఆకులు పెద్ద సైజ్‌లో ఉంటాయి. అందువల్ల గాలి నుంచి వచ్చే వ్యర్థాలు, దుమ్ము, ధూళి కణాలను సులువుగా గ్రహిస్తాయి. ఈ మొక్క ఆకులను తరుచూ శుభ్రం చేస్తుండాలి. ప్రతిరోజూ ఒకే సమయంలో ఒకే పరిమాణంలో నీటిని పోయాలి. లేకపోతే ఆకులు రాలిపోయే ప్రమాదం ఉంది.
- గార్డెనింగ్ ఔత్సాహికులు, అనుభవజ్ఞులకు మనీ ప్లాంట్ సరైన మొక్క. నిర్వహణ కోసం పెద్దగా కష్టపడాల్సిన పన్లేదు. అంత త్వరగా ఎండిపోదు. ఇంటి గాలిలోని బెంజెన్లు, ఫార్మాల్డిహైడ్ వంటి విష రసాయనాలను మనీ ప్లాంట్ గ్రహిస్తుంది. వీటిని కుండీల్లో, బుట్టల్లో ఎక్కడైనా వేలాడదీయవచ్చు లేదా నీటి గిన్నెలలో కూడా పెంచుకోవచ్చు. ఇవి నిలువుగా పెరుగుతుంటాయి. ఇంటి లోపల, ఆరుబయట, ప్రవేశ ద్వారం వద్ద వీటిని ఉంచుకోవచ్చు. ఏ మొక్కకైనా సరే అతిగా నీళ్లు పోయకూడదు. ఎంత పరిమాణంలో నీటిని పోయాలో తెలుసుకోవాలంటే అది ఉండే మట్టిని పరిశీలించాలి.
- కాలుష్య కారకాలను తొలగించడం, కార్బన్ మోనాక్సైడ్, అమ్మోనియా ఫార్మాల్డిహైడ్, ట్రైక్లోరెథైలీన్‌లను పీల్చుకోవటంలో, ఇండోర్‌లోని గాలిని శుభ్రం చేయడంలో పీస్ లిల్లీలు అద్భుతంగా పనిచేస్తాయన్న విషయం చాలా మందికి తెలియదు. ఇది పుష్పించే మొక్క కాదు. ఇది ఉష్ణమండల ప్రాంతాల నుంచి వస్తుంది. ఇది పెరగాలంటే నేల, తేమ అవసరం. దీనికి తరుచూ నీళ్లు పోస్తుండాలి. ఆకులు పడిపోతున్నాయంటే నీటి అవసరం ఉందన్న విషయం మీరు గ్రహించాలి.
- ఈ మొక్కలు ఆకుపచ్చ, ఎరుపు రంగులతో పాటు అనేక రకాలుగా వస్తాయి. చైనీస్ ఎవర్‌గ్రీన్ లేదా ఆగ్లోనెమాస్ బహుముఖ ప్రయోజనాలు ఉండే మొక్కలు. వీటి నిర్వహణ సులువు. అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుంటాయి. వీటిని ఇంటీరియర్ డిజైనింగ్‌లో వినియోగించుకోవచ్చు. అధిక స్థాయిలో ఆక్సిజన్‌ను విడుదల చేయడంతో పాటు హానికారక రసాయనాలను పీల్చుకుంటాయి. అన్ని వాతావరణ పరిస్థితుల్లో.. ఇంట్లో ఎక్కడైనా ఈ మొక్కలు పెరుగుతాయి.

# లిటిల్ ఫ్రెండ్స్ కోసం.. సూపర్ గాడ్జెట్స్

"హుషారుగా ఆడుకుంటూ, సరదాగా నేర్పించే మ్యాజిక్ మెషిన్స్‌ను తెలివిగా వాడుకుంటే, ఏ పిల్లలైనా చదువుల్లోనే కాదు, ఆరోగ్యంపైన కూడా శ్రద్ధ చూపిస్తారు. పిల్లల కోసం టెక్నాలజీ అందించిన ఫ్రెండ్లీ గాడ్జెట్స్ మీ కోసం..









## బ్రషింగ్ గేమ్ ఆడుదాం!

చిన్నపిల్లలకు బ్రషింగ్ చేయించడం అంటే మినీ యుద్ధం చేయటంలాంటిది. శత్రుసైన్యంగా ఉండే టూత్‌పేస్ట్‌కి టార్చర్. బ్రష్‌కు బ్రేకప్.. ఇలా పేస్ట్, బ్రష్‌లతో పేరెంట్స్ పిల్లలకు బ్రషింగ్ చేయించడానికి పోరాడుతుంటారు. ఇప్పుడు ఈ యుద్ధానికి ఒక చిన్న టూత్‌బ్రష్ స్వస్తి పలికింది. 'విల్లో అటో ఫ్లో' కేవలం టూత్‌బ్రష్ మాత్రమే కాదు. ఇదొక అటోమెటిక్ బ్రషింగ్ డివైజ్. బలమైన, మృదువైన బ్రిసిల్స్‌తో ఇది చాలా సులభంగా పిల్లలకు బ్రషింగ్ చేయిస్తుంది. నీళ్లు తానే తీసుకుంటుంది. పేస్ట్ తానే ఇస్తుంది. దీనిని మొబైల్ యాప్‌కు కనెక్ట్ చేసుకొని వాడితే, మరింత ఆసక్తికరంగా పనిచేస్తుంది. 'క్యావిటీ కిల్లర్' టైటిల్‌తో యాప్‌లో పిల్లలతో బ్రషింగ్ గేమ్ ఆడేలా చేస్తుంది. వివిధ కౌంట్‌డౌన్‌లు, బ్యాడ్జ్‌లు, రివార్డ్స్ ఇస్తూ వారికి బ్రషింగ్ అంటే ఇకపై యుద్ధంలా కాకుండా, ఒక సరదా ఆటలా కనిపించేలా చేస్తుంది. ఇక అప్పటి నుంచి టూత్‌పేస్ట్ బాత్‌రూమ్ గోడలపై కాదు, పళ్లపై ఉంటుంది. ధర 249 డాలర్లు (రూ.21,266).

## ఉఫ్.. ఉఫ్.. పిల్లి

చూడటానికి చిన్నగా కనిపించే ఈ బుజ్జి పిల్లి. చేసే పని తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఏ పిల్లి అయినా తన తోక నొక్కితే వెంటనే 'మ్యావ్.. మ్యావ్..' అంటూ బయటకు వినిపించని బూతులెన్నో తిడుతుంది. కాని, 'నికోజిటా ఫు ఫు' అనే ఈ పిల్లి మాత్రం దీని తోకకున్న బటన్ నొక్కగానే 'ఉఫ్.. ఉఫ్..' అంటూ వేడి వేడిగా ఉండే ఫుడ్‌ని కేవలం మూడు నిమిషాల్లోనే 'ఇప్పుడు లాగించొచ్చు' అనే స్థితిలోకి వచ్చేలా చల్లారుస్తుంది. చిన్నపిల్లలు ఉండే ఇంట్లో దీని అవసరం చాలా ఉంటుంది. ప్లేట్, బౌల్, కప్పు ఇలా ఏ వస్తువుకైనా ఈజీగా దీనిని తగిలించుకొని ఉపయోగించుకోవచ్చు. రీచార్జబుల్, వాషబుల్. ఒక్కసారి చార్జ్ చేస్తే దాదాపు ఒక గంట వరకు పనిచేస్తుంది. ధర 27 డాలర్లు (రూ. 2,303) మాత్రమే!

## పీస్‌ఫుల్ గుడ్

ఇల్లు పీకి పందిరేసే పిల్లలతో కూడా శాంతి మత్రం జపించేలా చేయగలడు ఇతడు. చూడ్డానికి చాలా చిన్నగా ఒక చిన్న పక్షి గుడ్డు సైజులో ఉంటాడు. తాకి చూస్తే దూది కంటే మెత్తగా ఉంటాడు. కాని, మహా మొండి ఘటాల్లాంటి పిల్లలను కూడా ప్రశాంతంగా మార్చేస్తాడు. ఇంతకీ మార్కెట్‌లోకి వచ్చిన ఈ కొత్త యోగా గురువు పేరు ఏంటంటే 'మూడ్ బడ్డీ'. దీనిని ఒక పది నిమిషాలు పిల్లల చేతికి అందిస్తే చాలు, వెంటనే ప్రశాంతంగా మారిపోతారు. ఇందులో నాలుగు రకాల బ్రీతింగ్ మోడ్స్ ఉంటాయి. ఇందులో వివిధ వాయిస్ కమాండ్స్, వైబ్రేషనల్ మోడ్స్ ఉంటాయి. ఇవి క్షణాల్లో మెదడును శాంతపరిచి, సెలెంట్ మోడ్‌లోకి తీసుకురావడానికి ఉపయోగపడతాయి. రోజూ దీనిని వాడితే ప్రశాంతంగా మారడమే కాదు, సరైన సమయానికి నిద్ర కూడా పోతారట. ధర 99 డాలర్లు (రూ.8,458).

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# చైనాతో తక్షణ ప్రమాదం వాస్తవం


**ఇండో-పసిఫిక్ దేశాలు అప్రమత్తంగా ఉండాలి.. అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ హెచ్చరిక**

**సింగపూర్:** డ్రాగన్ దేశం చైనా నుంచి ఇండో-పసిఫిక్ దేశాలకు తక్షణ ముప్పు పొంచి ఉందని, ఇది నిజమని అమెరికా విదేశాంగ మంత్రి పీటర్ హెగ్సెత్ హెచ్చరించారు. చైనా నుంచి ఎదురయ్యే సైనిక, ఆర్థికపరమైన ఒత్తిడుల నేపథ్యంలో ఈ ప్రాంతంలోని మిత్ర దేశాలను ఒంటరిగా వదిలేయబోమని హామీ ఇచ్చారు. అదే సమయంలో, ఆయా దేశాలు రక్షణపరంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. జీడీపీలో 5 శాతం మేర రక్షణ రంగానికి కేటాయించాలని సూచించారు. యూరప్ దేశాలు సైతం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చైనా నుంచి వేగంగా పెరుగుతున్న ముప్పును, ముఖ్యంగా తైవాన్ విషయంలో దుందుడుకు చర్యలకు ముకుతాడు వేసేందుకు అమెరికా రక్షణ చర్యలను ముమ్మరం చేస్తుందని ప్రకటించారు. తైవాన్‌ను ఆక్రమించుకునేందుకు చైనా ఆర్మీ రిహార్సల్స్ చేస్తోందని హెగ్సెత్ వ్యాఖ్యానించారు. ఇదే లక్ష్యంతో సైన్యానికి రోజువారీ శిక్షణ అందిస్తోందన్నారు. 2027 నాటికి తైవాన్‌ను విలీనం చేసుకోవాలనే లక్ష్యాన్ని సాధించే సత్తా తమకుందని చైనా ఇప్పటికే చేసిన ప్రకటనపై ఆయనీ వ్యాఖ్యలు చేశారు. సింగపూర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ భద్రతా సదస్సు 'షంగ్రీ లా డైలాగ్'లో హెగ్సెత్ శనివారం కీలకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెక్యూరిటీ స్టడీస్ ఏర్పాటు చేసింది. చైనా విస్తారమైన దక్షిణ చైనా సముద్రంలో కృత్రిమ ద్వీపాలను ఏర్పాటు చేసి మిలటరీ ఔట్ పోస్టులను నెలకొల్పుతోంది. అత్యంత అధునాతన హైపర్‌సోనిక్ క్షిపణులను తయారు చేయడంతోపాటు అంతరిక్షంలోనూ పైచేయి సాధించేందుకు వేగంగా పావులు కదుపుతోంది. ఈ బెడదను దృష్టిలో ఉంచుకునే అమెరికా 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు సిద్ధమైంది. పనామా కాలువ సహా లాటిన్ అమెరికా ప్రాంతంలోనూ పలుకుబడిని పెంచుకునేందుకు చైనా ప్రయత్నిస్తోందని హెగ్సెత్ ఆరోపించారు. ఈ ప్రాంతంలోని కొన్ని దేశాలు అమెరికా సైనిక మద్దతును పొందుతూనే చైనాతో ఆర్థికంగా సంబంధాలు నెరుపుతుండటం ప్రమాదకరమైన వ్యవహారమని హెగ్సెత్ పేర్కొన్నారు. యూరప్ దేశాలు తమ సొంత భద్రతను చూసుకోవాలని, ఇండో-పసిఫిక్ బాధ్యతను అమెరికాకు వదిలేయాలన్నారు. అనంతరం మాట్లాడిన ఈయూ ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్ హెగ్సెత్ వ్యాఖ్యలను ఖండించారు. 'ఉత్తరకొరియా బలగాలు రష్యా తరఫున ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నాయి. అదే సమయంలో, రష్యాకు చైనా మద్దతుగా నిలుస్తోంది. యూరప్, ఆసియాల భద్రత ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి'అని పేర్కొన్నారు.



## హాజరు కాని చైనా రక్షణ మంత్రి

ఏటా జరిగే ఈ సదస్సుకు చైనా తన రక్షణ మంత్రిని పంపిస్తుంటుంది. అమెరికాతో నడుస్తున్న టారిఫ్ విభేదాల నేపథ్యంలో ఈసారి దిగువ స్థాయి అధికారులతో కూడిన బృందాన్ని పంపించింది. హెగ్సెత్ వ్యాఖ్యలను ఈ బృందంలోని చైనా నేషనల్ డిఫెన్స్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ హు గంగ్‌ఫెంగ్ తీవ్రంగా ఖండించారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు.




# జాగ్రత్త.. 25 కోట్ల తేనెటీగలు తప్పించుకున్నాయి

**వాషింగ్టన్‌లో బోల్తా పడిన తేనెతుట్టెల వాహనం**

**వాషింగ్టన్:** మల్లాది 'నత్తలొస్తున్నాయ్ జాగ్రత్త' నవల గుర్తుందా? కెన్యా నుంచి వచ్చిన భయంకరమైన రాక్షస నత్తలు ఓ రైలు ప్రమాదంలో తప్పించుకుని ఆంధ్ర రాష్ట్రంపై పడతాయి. చూస్తుండగానే అసంఖ్యాకంగా పెరిగిపోయి అల్లకల్లోలం చేసిపారేస్తాయి. అదీ, ఇదీ అని తేడా లేకుండా దొరికినదాన్నల్లా తినేస్తూ భయోత్పాతం సృష్టిస్తాయి. అమెరికాలో వాషింగ్టన్ రాష్ట్రంలో కూడా అలాంటి సంఘటనే ఒకటి జరిగింది. ఒకటీ రెండూ కాదు, ఏకంగా 25 కోట్ల తేనెటీగలు తప్పించుకున్నాయి! 31,751 కిలోల తేనెతుట్టెలతో వెళ్తున్న వాహనం లిండెన్ సమీపంలో కెనడా సరిహద్దు ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ మూలమలుపు వద్ద వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో బోల్తా పడింది. తేనెతుట్టెలన్నీ చెల్లాచెదురుగా పడిపోవడంతో తేనెటీగలు బయటికొచ్చి జారుకున్నాయి. విషయం తెలియగానే పోలీసులు తేనెటీగల నిపుణులతో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అంతా కలిసి తేనెతుట్టెలను ఒక్కచోటికి చేర్చారు. తప్పించుకున్న తేనెటీగల కోసం ఎదురుచూస్తూ గడుపుతున్నారు. అవి తప్పకుండా తుట్టెల వద్దకు తిరిగొస్తాయని నిపుణులు చెప్పారు. ''తేనెటీగలు రాణి ఈగను విడిచి ఉండలేవు. దాన్ని తీసుకొని రెండు మూడు రోజుల్లో వచ్చేస్తాయి'' అని వివరించారు. కనుక రెండు మూడు రోజులపాటు పరిసర ప్రాంతాలకు రావొద్దని స్థానికులకు పోలీసులు సూచించారు. అమెరికాలో లక్షలాది తేనెటీగలను తరచుగా ఇలా ఒకచోటి నుంచి మరోచోటికి తరలిస్తుంటారు. వ్యవసాయంలో తేనెటీగలది కీలక పాత్ర. పరాగ సంపర్కానికి, పంటలు పండడానికి దోహదపడతాయి. ప్రపంచవ్యాప్తంగా తేనెటీగల సంఖ్య భారీగా తగ్గిపోతుండటంతో మే 20ని 'ప్రపంచ తేనెటీగల దినం'గా జరుపుకోవాలని ఐరాస 2018లో పిలుపునిచ్చింది.


# సరదాల వేళ... తలుపులతో జాగ్రత్త!




**వాషింగ్టన్:** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్‌ను ఆయన భార్య ముఖంపై చేతులు వేసి తోసేస్తున్న వీడియో ఇటీవల ప్రపంచవ్యాప్తంగా వైరల్ కావడం తెలిసిందే. దానిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తాజాగా స్పందించారు. శుక్రవారం మీడియా భేటీ సందర్భంగా విలేకరులు ఈ అంశాన్ని లేవనెత్తారు. ''అది అధ్యక్ష దంపతుల నడుమ సరదా సన్నివేశం మాత్రమే. మాక్రాన్‌తో మాట్లాడాను. వారి మధ్య సమస్యేమీ లేదు. అంతా బానే ఉంది''అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఓ దేశాధినేతగా వైవాహిక బంధానికి సంబంధించి మరో దేశాధ్యక్షునికి మీరిచ్చే సలహా ఏమిటని ప్రశ్నించగా, ''సరదాల వేళ తలుపులు మూసున్నదీ, లేనిదీ ఒకటికి రెండుసార్లు సరిచూసుకోండి చాలు. అంతకంటే మరేమీ అక్కర్లేదు''అంటూ బదులిచ్చి నవ్వులు పూయించారు.

# రష్యాలో ఘోర రైలు ప్రమాదం.. పలువురు మృతి, గాయాలు

**మాస్కో:** రష్యాలో ఘోర రైలు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. శనివారం రాత్రి రైల్వే బ్రిడ్జి కూలిపోవడంతో ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతిచెందగా.. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. పలువురు ప్రయాణికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. వివరాల ప్రకారం.. రష్యాలోని బ్రయాన్స్క్ ప్రాంతంలో శనివారం రాత్రి వంతెన కూలిపోయింది. అదే సమయంలో ప్యాసింజర్ రైలు వెళ్తున్న కారణంగా సదరు రైలు ప్రమాదానికి గురైంది. ఉక్రెయిన్ సరిహద్దుకు సమీపంలోని రష్యాలోని బ్రయాన్స్క్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని రష్యా అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఏడుగురు మరణించగా, దాదాపు 30 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా బ్రయాన్స్క్ ప్రాంతీయ గవర్నర్ అలెగ్జాండర్ బొగోమాజ్ మాట్లాడుతూ.. రైలు ప్రమాదం నేపథ్యంలో అత్యవసర సేవలు, ప్రభుత్వ అధికారులు సంఘటన స్థలంలో సహాయక చర్యలు చేపట్టారని తెలిపారు. మృతిచెందిన వారిలో రైలు లోకో పైలట్ కూడా ఉన్నారు. ప్యాసింజర్ రైలు మాస్కో నుండి క్లిమోవ్‌కు వెళుతోందని అన్నారు. అయితే, గత మూడేళ్లుగా రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. బ్రయాన్స్క్ ప్రాంతం రష్యా, ఉక్రెయిన్ సరిహద్దుల్లో ఉండటంతో డ్రోన్ దాడులు, బాంబు దాడులు జరిగాయి. ఈ నేపథ్యంలోనే దాడుల ప్రభావంతో వంతెన కూలిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు.





## నేను వారికి ప్రత్యేకంగా చేసిందేమీ లేదు: ఎస్వీ కృష్ణారెడ్డి

"నా సినిమాల ద్వారా ఎందరో ప్రతిభావంతులకు అవకాశాలు ఇచ్చానని చెబుతున్నారు. కానీ వాళ్లందరూ స్వతహాగా ప్రతిభ ఉన్నవారు. నా చిత్రాల ద్వారా వారి ప్రతిభ ప్రేక్షకులకు మరింతగా తెలిసింది. అంతేకానీ నేను వారికి ప్రత్యేకంగా చేసిందేమీ లేదు" అని దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం (జూన్ 1) హైదరాబాద్‌లో ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- "నన్ను మొదటి నుంచీ ప్రోత్సహిస్తూ, అండగా నిలబడిన నిర్మాత అచ్చిరెడ్డిగారికి కృతజ్ఞతలు. దర్శకుడిగా నాకు తొలి చాన్స్ ఇచ్చిన హీరో రాజేంద్రప్రసాద్‌గారికి థ్యాంక్స్" అన్నారు. నటి, మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ- "కృష్ణారెడ్డిగారి దర్శకత్వంలో చేసిన 'శుభలగ్నం' చిత్రం నా కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోతుంది. భర్తను కోటి రూపాయలకు అమ్మే అలాంటి ఘటనలు ఈ రోజు సమాజంలో జరుగుతున్నాయి. అంటే ఆయన సృజనాత్మకతలో ఎంత ముందు చూపు ఉందో ఊహించుకోవచ్చు" అని తెలిపారు. ఈ వేడుకల్లో మురళీమోహన్, బ్రహ్మానందం, శ్రీకాంత్, తనికెళ్ల భరణి, రాజేంద్రప్రసాద్, అలీ, బండ్ల గణేశ్, లయ, ఇంద్రజ, ఆమని, సుచిత్రా చంద్రబోస్ తదితరులు పాల్గొని, ఎస్వీ కృష్ణారెడ్డితో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.



## ప్రభాస్ మూవీకి రివ్యూ ఇస్తా

### అవకాశం వస్తే బాలీవుడ్ సినిమాలో నటిస్తా
### తెలంగాణ ప్రజలు చాలా గౌరవ ఆతిథ్యం ఇచ్చారు
### ఇక్కడి సంప్రదాయాలు, సంస్కృతి ఎంతగానో నచ్చాయి
### నాకు హైదరాబాద్ బిర్యానీ అంటే చాలా ఇష్టం
### మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ

**మహా:** బ్యూటీ విత్ పర్పస్‌ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ పేర్కొన్నారు. తెలంగాణలో ఆతిథ్యానికి రుణపడి ఉంటానన్నారు. హైదరాబాద్ వేదికగా జరిగిన మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని హైదరాబాద్ హైటెక్స్ వేదికగా శనివారం జరిగిన పోటీల్లో థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్ సొంతం చేసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఈ విజయం తనకు ఎంతో సంతోషం కలిగించిందని చెప్పింది. తెలంగాణలో సోషల్ సర్వీస్ చేయనున్నట్లు పేర్కొంది. మిస్ వరల్డ్ కిరీటం అందుకునే సమయంలో భావోద్వేగానికి గురయ్యానని, అదే సమయంలో షాక్‌కు గురయ్యానని చెప్పారు. బాహుబలి మూవీ గురించి విన్నానని.. ఆ మూవీ చూడలేదని పేర్కొంది. పోటీలు పూర్తయ్యాక ఆ మూవీని చూడాలని నాకు నేనే ఒట్టు వేసుకున్నానని, మళ్లీ ఇక్కడికి వచ్చే నాటికి తప్పకుండా ఆ మూవీపై రివ్యూ ఇస్తానని తెలిపారు. అవకాశం వస్తే బాలీవుడ్ సినిమాలో నటిస్తానని, అదే నాకు ఓ మంచి అవకాశం అవుతుందని చెప్పుకొచ్చారు. మిస్ వరల్డ్ కిరీటం గెలువడం తన జీవితంలో అద్భుతమైన రోజని, వ్యక్తిగతంగానే కాకుండా థాయ్‌లాండ్ ప్రజలకు మైలురాయిగా అభివర్ణించారు. ఈ విషయంలో తాను గర్వపడుతున్నానని, మిస్ వరల్డ్ వేదికపై తమ దేశానికి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. పోటీల్లో తాను మాత్రమే విజేతను కానని, పోటీదారులంతా తన దృష్టిలో విజేతలేనని చెప్పింది. ఇక్కడ మొదలైన తన ప్రయాణం చాలా అద్భుతమని.. ఈ జర్నీలో చాలా విషయాలు నేర్చుకున్నానని చెప్పింది. తెలంగాణ ప్రజలు గౌరవ ఆతిథ్యం ఇచ్చారని.. వారిని మరిచిపోలేనని చెప్పింది. తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని చెప్పింది. మిస్ వరల్డ్ కావాలన్న తన కల నెరవేరిందని చెప్పింది. హైదరాబాద్ అంటే తనకు ఇష్టమని, తెలంగాణ ఆతిథ్యం బాగుందని చెప్పింది. చౌమహల్లా ప్యాలెస్, పిల్లలమర్రి చాలా బాగున్నాయని.. ఓపల్ ఫర్ హర్ ప్రాజెక్టు కోసం మరింత కృషి చేస్తానని చెప్పుకొచ్చారు.





## తమిళ హీరోతో రిలేషన్.. నిధి ఏం చెప్పిందంటే?

సినిమా ఇండస్ట్రీలో హీరోహీరోయిన్ల మధ్య ప్రేమలో ఉన్నారని రూమర్స్ రావడం సహజం. కలిసి సినిమా చేస్తున్న టైంలో ఇలాంటివి ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఇటీవల కాలంలో అయితే శ్రీలీల.. బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో డేటింగ్ చేస్తుందని టాక్ వినిపించింది. ఇందులో నిజానిజాల సంగతి పక్కనబెడితే ఇప్పుడు మరో హీరోయిన్.. తనపై వస్తున్న గాసిప్స్ గురించి క్లారిటీ ఇచ్చేసింది. 'ఇస్మార్ట్ శంకర్'తో పాటు తెలుగులో పలు సినిమాలు చేసిన నిధి అగర్వాల్.. ప్రభాస్‌తో 'రాజాసాబ్', పవన్ కల్యాణ్ 'హరిహర వీరమల్లు' చిత్రాల్లో నటించింది. పవన్ మూవీ.. ఈ నెల 12న థియేటర్లలోకి రాబోతుంది. ఈ సందర్భంగా ప్రమోషన్లలో పాల్గొన్న నిధికి.. తమిళ హీరో శింబుతో రిలేషన్ అంటూ వచ్చిన రూమర్స్‌పై ప్రశ్న ఎదురైంది. దీనికి సవివరంగా క్లారిటీ ఇచ్చేసింది. 'సినిమాల్లో నటించిన హీరోయిన్ల గురించి చాలా పుకార్లు వస్తాయి. మరీ ముఖ్యంగా వారి వ్యక్తిగత జీవితం గురించి అందరూ ఎక్కువగా ఫోకస్ చేస్తారు. ఏది అనిపిస్తే అది బయటకు అనేస్తారు. ఇదంతా చాలా కామన్. ఎందుకంటే జనాలకు నిజాల కంటే రూమర్లపైనే ఎక్కువ ఇంట్రెస్ట్. అందుకే నేను వాటిని పెద్దగా పట్టించుకోను. నా గురించి ఎప్పుడూ ఏదో ఒకటి ఇలాంటివి వినిపిస్తూనే ఉంటాయి' అని నిధి అగర్వాల్ చెప్పుకొచ్చింది.


క్రీడా వార్తలు SPORTS NEWS


## క్రికెటర్ రింకు సింగ్- ఎంపీ ప్రియా సరోజ్
# పెళ్లి ముహూర్తం ఫిక్స్..!

జౌన్‌పూర్‌లోని మచ్లిషహర్ ఎంపీ ప్రియా సరోజ్ సింగ్, ప్రముఖ క్రికెటర్ రింకు సింగ్ పెళ్లి ముహూర్తం ఫిక్స్ అయ్యింది. వీరిద్దరి నిశ్చితార్థం ఈ నెల 8న లక్నోలో జరగనున్నది. ఇక వివాహం నవంబర్ 18న వారణాసిలోని హోటల్ తాజ్‌లో జరుగనున్నది. ఈ వివాహ వేడుకకు క్రికెటర్లతో పాటు సినీ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలు హాజరు కానున్నారు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున ఆడుతున్న అలీగఢ్‌కు చెందిన రింగు సింగ్ ప్రియాను వివాహం చేసుకోనున్నారు. తొలిసారి ఎంపీగా ఎన్నికైన ప్రియా సరోజ్ తండ్రి కెరాకట్ అసెంబ్లీ స్థానం నుంచి ఎస్పీ ఎమ్మెల్యే అయిన తుఫానీ సరోజ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అలీగఢ్‌లో రింకు కుటుంబాన్ని కలిశానని ఎమ్మెల్యే చెప్పారు. కుటుంబ సభ్యులు వివాహానికి సిద్ధంగా ఉన్నారని.. ఐపీఎల్ తర్వాత వివాహం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఎంగేజ్‌మెంట్ వేడుక తేదీని నిర్ణయించినట్లు తెలిపారు. సంప్రదాయబద్ధంగా వివాహం జరుగుతుందని.. దేశవ్యాప్తంగా ప్రముఖ రాజకీయ నాయకులు, క్రికెటర్లు, సినీ తారలు హాజరవుతారన్నారు. ప్రియా సరోజ్ వృత్తిరీత్యా న్యాయవాది కాగా.. ప్రియా, రింకు ఇద్దరికి పరిచయం ఉంది. పరిచయం స్నేహంగా.. ఆ తర్వాత ప్రేమగా మారింది. వీరిద్దరి పెళ్లికి ఇరు కుటుంబాలు సైతం అంగీకరించాయి.




రింకు సింగ్ 1997 అక్టోబర్ 12న అలీఘగ్‌లోని చాలా సాధారణ కుటుంబంలో జన్మించాడు. అతడి తండ్రి ఖాంచంద్ర గ్యాస్ ఏజెన్సీలో సిలిండర్లు పంపిణీ చేసేవాడు. రింకు సైతం తండ్రికి సహకారం అందిస్తుండే వాడు. పేదరికం నుంచి వచ్చినా క్రికెట్‌ను కెరియర్‌గా ఎంచుకొని టీమిండియాకు ఎంపికయ్యాడు. ఐపీఎల్‌లో 2023 సీజన్‌లో కేకేఆర్ తరఫున అద్భుత ప్రదర్శన చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆ తర్వాత టీ20 క్రికెట్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. వన్డే జట్టులోనూ చోటు దక్కించుకున్నాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో కేకేఆర్ రూ.13కోట్లకు రిటైన్ చేసుకుంది. రింకు సింగ్‌ని 2017లో కింగ్స్‌లెవెన్ పంజాబ్ రూ.10లక్షలు కొనుగోలు చేసింది. ఆ సమయంలో తుది జట్టులో చోటు దక్కలేదు. 2018 సీజన్లో కోల్‌కతా నైట్ రైడర్స్ రూ.80 లక్షలకు తమ జట్టులో చేర్చుకుంది. ప్రస్తుతం రింకు వార్షిక ఆదాయం దాదాపు రూ.60 నుంచి రూ.80లక్షల ఆదాయం ఉంటుందని అంచనా. 2024 రింకు సింగ్ ఆస్తులు దాదాపు రూ.8 కోట్లుగా అంచనా.

## ముంబై ఔట్.. ఫైనల్‌కు దూసుకెళ్లిన పంజాబ్..

ఐపీఎల్ 2025 ఫైనల్‌కు పంజాబ్ కింగ్స్ దూసుకెళ్లింది. క్వాలిఫయర్ 2లో ముంబై ఇండియన్స్‌ను ఓడించి.. తుది పోరుకు అర్హత సాధించింది. ఈ మ్యాచులో ఓడిన ముంబై ఇండియన్స్.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై 204 రన్స్ లక్ష్యాన్ని నిర్దేశించింది. పంజాబ్.. మరో ఓవర్ మిగిలి ఉండగానే గెలుపొందింది. శ్రేయస్ అయ్యర్.. అజేయ హాఫ్ సెంచరీతో మ్యాచును గెలిపించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. ఫస్టు బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే ఈ మ్యాచ్ వర్షం కారణంగా 2.15 గంటలు ఆలస్యంగా రాత్రి 9.45 నిమిషాలకు ప్రారంభమైంది. ఓవర్లు మాత్రం కుదించలేదు. నిర్ణీత సమయంలోకా మ్యాచ్ ప్రారంభం కావడంతో 20 ఓవర్ల ఆటకు అంపైర్లు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జానీ బెయిర్ స్టో (24 బంతుల్లో 38 రన్స్), తిలక్ వర్మ (29 బంతుల్లో 44 రన్స్), సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 44 రన్స్), నమన్ ధీర్ (18 బంతుల్లో 37 రన్స్) చేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 రన్స్ స్కోరు చేసింది ముంబై ఇండియన్స్. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 2, విజయ్ కుమార్ వైశాక్ 1, యుజ్వేంద్ర చాహల్ 1, మార్కస్ స్టోయినిస్ 1, కైల్ జెమీసన్ 1 వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే షాక్ తగిలింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (6) స్వల్ప స్కోరుకే ఔట్ అయ్యాడు. ప్రియాన్ష్ ఆర్య (10 బంతుల్లో 20 రన్స్) క్రీజులో ఉన్నంత సేపు అలరించాడు. ఎలిమినేటర్‌లో



ముంబైని గెలిపించిన జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో జోష్ ఇంగ్లిస్ పెను విధ్వంసం సృష్టించాడు.

ఈ మ్యాచ్‌లో అతడు వేసిన తొలి ఓవర్‌లోనే 2 సిక్సులు, 2 ఫోర్లు కొట్టి 20 రన్స్ రాబట్టాడు. దీంతో పవర్ ప్లే ముగిసే సరికి పంజాబ్ కింగ్స్.. 64/2తో నిలిచింది. ఈ దశలో నేహాల్ వధేరా (29 బంతుల్లో 48 రన్స్)తో కలిసి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇన్నింగ్స్‌ను చక్క దిద్దాడు. బుమ్రా బౌలింగ్‌లో ఆచీతూచీ ఆడిన పంజాబ్ బ్యాటర్లు.. మిగతా వారి బౌలర్లను ఊచకోత కోశారు. భారీగా రన్స్ సాధించారు. దీంతో పంజాబ్ కింగ్స్ లక్ష్యం దిశగా సాగింది. చివరి వరకూ క్రీజులో ఉన్న కెప్టెన్ అయ్యర్.. జట్టుకు విజయాన్ని అందించాడు. దీంతో పంజాబ్ కింగ్స్ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. శ్రేయస్ అయ్యర్ (41 బంతుల్లో 87 రన్స్ నాటౌట్) హాఫ్ సెంచరీతో పంజాబ్ కింగ్స్ మరో ఆరు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. క్వాలిఫయర్ 1లో ఆర్సీబీ చేతిలో ఓడిపోయిన పంజాబ్ కింగ్స్.. ఐపీఎల్ 2025 ఫైనల్‌లో అదే జట్టుతో ఆడేందుకు సిద్ధమైంది. జూన్ 3న గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

## ఇక బౌలర్లకు పండగే.. త్వరలోనే కొత్త రూల్‌ని తీసుకురానున్న ఐసీసీ..!

ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ICC) త్వరలోనే కొత్త రూల్స్‌ను తీసుకురాబోతున్నది. ఇది బౌలర్లకు పండగలాంటి వార్తే. వన్డే క్రికెట్‌లో గత కొద్ది సంవత్సరాలుగా రెండు బాల్స్ నిబంధన అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ రూల్ బౌలర్లకు పెద్దగా అనుకూలంగా లేదని.. బ్యాటర్లకు ఉపకరిస్తుందనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో కొత్త నిబంధనతో బౌలర్లకు ప్రయోజనం చేకూరనున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుత అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఒక వన్డే ఇన్నింగ్‌లో రెండు వేర్వేరు బాల్స్‌ను ఒక్కో ఎండ్ నుంచి 25 ఓవర్ల చొప్పున బౌలింగ్ వేస్తున్న విషయం తెలిసిందే. అయితే, క్రిక్ బజ్ నివేదిక ప్రకారం.. జులై నుంచి కొత్తగా ఈ కొత్త నిబంధన అమలులోకి రానున్నది. ఈ రూల్స్ ప్రకారం.. మ్యాచ్ ప్రారంభం నుంచి 34 ఓవర్‌కు రెండు బాల్స్‌ను ఉపయోగిస్తారు. అప్పటి నుంచి ఒక్కో ఎండ్ నుంచి రెండో బాల్స్‌ని ఉపయోగిస్తారు. అయితే, 35వ ఓవర్ తర్వాత ఫీల్డింగ్ సైడ్ రెండు బాల్స్‌లో ఒక దాన్ని మాత్రమే ఎంచుకొని.. మిగతా ఓవర్ల వరకు అదే బాల్‌ను వినియోగించాల్సి ఉంటుంది. గతంలో రెండు బాల్స్ వాడటం వల్ల ఒక బంతి చాలా ఎక్కువగా పాతపడకపోవడం వల్ల రివర్స్ స్వింగ్ చాలా అరుదుగా లభిస్తుండేది. కానీ, 35వ ఓవర్‌లో ఒకే బాల్‌ను కొనసాగించడం వల్ల బంతి పాతపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దాంతో చివరి 10 ఓవర్లలో రివర్స్ సింగ్ లభించే అవకాశాలు మరింత పెరుగుతాయి. దాంతో బౌలర్లకు మరింత ప్రయోజనకరంగా ఉండనున్నది. వన్డేల్లో బ్యాట్స్‌మెన్ హవా ఎక్కువగా ఉందని.. బౌలర్లకు ఎలాంటి ప్రయోజనం లేదనే విమర్శలు వచ్చాయి. బాల్‌కు, బ్యాట్‌కు మధ్య పోటీ సమతూకంగా ఉండాలని చూడాలని పలువురు మాజీలు డిమాండ్ చేశారు. తాజాగా ఐసీసీ నవ్డే ఫార్మాట్‌లో సమతూకం తీసుకువచ్చినట్లవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.






EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com